మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 26-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | సంపుటి: 1 Volume:1 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంచిక: 297 Issue: 297

Circulated to Telangana
Published from Jagitial

26 ఏప్రిల్ 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:56 సూర్యాస్తమయం - సా. 6:31 తిథి దశమి సా. 6:11 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం మఖ రా. 8:27 వరకు తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ) యోగం వృద్ధి రా. 10:27 వరకు కరణం తైతుల ఉ. 6:14 వరకు గరజ సా. 6:11 వరకు వర్జ్యం ఉ. 8:15 నుండి ఉ. 9:52 వరకు దుర్ముహూర్తం సా. 4:50 నుండి సా. 5:40 వరకు రాహుకాలం సా. 4:57 నుండి సా. 6:31 వరకు యమగండం మ. 12:14 నుండి మ. 1:48 వరకు గుళికాకాలం మ. 3:22 నుండి సా. 4:57 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:20 నుండి తె. 5:08 వరకు అమృత ఘడియలు సా. 5:59 నుండి రా. 7:37 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:39 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## T R S

# తెలంగాణ రాష్ట్ర సేన!

## TELANGANA RASHTRA SENA

టీ తెలంగాణ
ఆర్ రాష్ట్ర
ఎస్ సేన

TRS
తెలంగాణ రాష్ట్ర సేన
TELANGANA RASHTRA SENA



### క్షమాపణ సరిపోదు



తెలంగాణ సాధించటంలో భాగమైనందుకు నా జన్మ ధన్యమైంది. కానీ, ఆనాడు పరిపాలించిన కుటుంబంలో భాగమైనందుకు సిగ్గుపడుతున్నా. నా తప్పులకు భాగస్వామ్యం ఉందన్న దానికి కేవలం క్షమాపణ చెబితే సరిపోదు. ఆ తప్పులను దిద్దుకోవటానికి కష్టపడి పనిచేయాలి. అందుకోసమే 'తెలంగాణ రాష్ట్ర సేన'గా వస్తున్నాం.

### అమ్మనై.. ఆలనాపాలన

తెలంగాణలోని మూడు కోట్ల మందికి ఒక అమ్మలాగా పరిణితి చెందాలని అనుకుంటున్నా. అమ్మతనంతో, ఆర్ధితో పాలన జరిగినప్పుడే కష్టాలు తీరుతాయి. రైతాంగ పోరాటం, ముల్కీ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం ఇలా సాగుతూనే ఉంది. చాకలి ఐలమ్మ, గద్దరన్న, మారోజు వీరన్న సహా అనేక మంది పోరాటం చేస్తేనే ఇలా మార్పులు వచ్చాయి.

### కేసీఆర్ మరమనిషి

ఆనాటి కేసీఆర్ వేరు, ఈనాటి కేసీఆర్ వేరు. ఆనాడు చేనేత కార్మికులు చనిపోతే భిక్షమెత్తి సాయం చేసిన వ్యక్తి కేసీఆర్.. వెలుగుమట్లలో, హైడ్రాలో ఇళ్లు కూలితే వచ్చారా? అయ్యా కేసీఆర్ రావాలి అంటే కూడా రాలేదు. చేవెళ్ల దగ్గర కష్టమొస్తే వచ్చారా? ఆయన మారిన మనిషి, మర మనిషి. మన మనిషి కాదు. గుంట నక్కలు, తోడేళ్లలో ఖైదీ అయిన మర మనిషి. దుఃఖంతో చెబుతున్న మాటలు ఇవి. సంతోషంతో కాదు.

### బీజేపీ ఎంపీలవి బానిస బతుకులు

బీజేపీ కి తెలంగాణ రావటమే ఇష్టం లేదు. తల్లిని చంపి బిడ్డను తీశారని బీజేపీ పెద్దలు అంటారు. మెడకాయ మీద తలకాయ లేని ఒక ఎంపీ తెలంగాణను భారత్ పాక్ విభజనతో పోల్చుతారు. అగ్రనాయకత్వం అలా మాట్లాడితే బీజేపీ బానిస ఎంపీలు ఒక్క మాట్లాడరు. మనకు ఒక్క రూపాయి ఇవ్వకపోయిన సరే మన బీజేపీ ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయం అనే దానికే బద్ద వ్యతిరేకి బీజేపీ. ఈ బీజేపీ బానిస ఎంపీలకు నేను సవాల్ చేస్తున్నా . మీరు తెలంగాణ బిడ్డలైతే భద్రాచలం వద్ద ఐదు గ్రామాలను తెలంగాణకు పట్టుకురండి.

### పాంచజన్యం

1. ఉచిత విద్య
2. ఉచిత వైద్యం
3. రైతే రాజు
4. ఉపాధి చేయూత
5. సామాజిక న్యాయం



### రాష్ట్రంలో కర్కోటకుడి పాలన

ఇవ్వాళ రాష్ట్రంలో ఒక కర్కోటకుడి పాలన నడుస్తోంది. వెలుగుమట్లలో అన్ని పర్మిషన్లు ఉన్నప్పటికీ ఇళ్లను కూలగొడితే బాధతో ఒక గర్భిణీకి అబార్షన్ అయ్యింది. ఆ గర్భిణీ తండ్రి రోదన ఇంకా కళ్ల ముందు మెదులుతోంది. అందుకే కర్కోటకుడు, నియంత అంటున్న. రెండు నెలల చిన్నారి చనిపోతే ఇప్పటికీ కూడా కేసు పెటట్టం లేదు. గురుకులాల్లో విషం పెట్టి పిల్లలను చంపితే ఈ ముఖ్యమంత్రి పట్టించుకోవటం లేదు. కర్ల రాజేశ్ అనే యువకుడిని లాకప్ డెత్ చేస్తే ఇప్పటికీ కేసు పెట్టలేదు. కాంగ్రెస్ మీద కచ్చితంగా మనమే పోరాటం చేస్తాం. ఇప్పుడు మనమే ప్రధాన ప్రతిపక్షం. రెండేళ్ల తర్వాత అధికారంలోకి వస్తాం.

### జేబును చూడ.. కడుపునే చూస్తా

కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలలను మూసేశారు. ప్రభుత్వ స్కూళ్లలో కనీస సదుపాయాలు లేవు. గుడిని ఎంత పవిత్రంగా చూస్తామో, బడిని అంతే పవిత్రంగా చూడాలి. ప్రతి ఊరిలో బడి ఉండాలె, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. మన ప్రభుత్వం వస్తుంది. నేను మీ అమ్మను. నేను జేబు చూడను. కడుపు చూస్తాను. ప్రైవేట్ పాఠశాలలో చదివినా సరే ఒక్క రూపాయి భారం పడకుండా ఉచిత విద్య బాధ్యత తీసుకుంటాం. ప్రాథమిక విద్య నుంచి పీహెచ్‌డీ వరకైనా సరే ఉచిత విద్య ఇస్తాం.

### ఎంత పెద్ద రోగమైనా రూపాయీ భారం కానివ్వ

గిగ్ వర్కర్లుగా విద్యార్థులు పనిచేస్తున్నారు. ఎంత వరకు చదువుకున్న సరే వారికి రూపాయి కూడా భారం కానివ్వం. ఎంత పెద్ద రోగం అయినా సరే రూపాయి కూడా భారం కానివ్వం. ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తే తెలంగాణ బిడ్డలే డబ్బులు సంపాదించి ప్రభుత్వానికి ఇస్తారు.

### ఉపాధి కోసం సర్కారు రుణం

ఉపాధి అంటే కేవలం ఉద్యోగం కాదు. మీరు ఒక ఆలోచనతో వస్తే రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు మీ అమ్మ ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుంది. నా యూత్‌ను నేను నమ్ముతున్నా. డైరెక్ట్‌గా వారికి మేమే రుణాలు ఇస్తాం.

## తెలంగాణ శక్తి TELANGANA RASHTRA SENA

## రాశి ఫలాలు

26.4.2026

మేషం: ఆరోగ్యం విషయంలో శుభవార్తలు అందుతాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. సోదరుల నుంచి స్థిరాస్తి లాభాలుంటాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. చేపట్టిన పనులు మిత్రుల సహాయ సహకారాలతో పూర్తిచేస్తారు. వృత్తి ఉద్యోగాలు సంతృప్తి కరంగా సాగుతాయి. వ్యాపారాలు లాభిస్తాయి.

వృషభం: వృధా ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక దూర ప్రయాణ సూచనలున్నవి. వృత్తి వ్యాపారాలలో తొందరపడి పెట్టుబడులు పెట్టడం మంచిది కాదు. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. నేత్ర సంబంధిత ఆరోగ్య విషయాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. దైవ చింతన కలుగుతుంది.

మిధునం: గృహమున ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వాహన వ్యాపారాలలో నూతన లాభాలను అందుకుంటారు. కుటుంబ సభ్యులతో సఖ్యత కలుగుతుంది. ఆర్థిక పరిస్థితి ఆశించిన విధంగా ఉంటుంది. ఉద్యోగమున సహోద్యోగులతో సఖ్యత కలుగుతుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి.

కర్కాటకం: ఆర్థిక లావాదేవీలు ఉత్సాహంగా సాగుతాయి. భాగస్వామ్య వ్యాపారాలలో నూతన లాభాలను అందుకుంటారు. అవసరానికి ఆప్తుల సహాయ సహకారాలు అందుతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది.

సింహం: ధనదాయం బాగుంటుంది. దూర ప్రాంతాల వారి నుండి అందిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. వృత్తి ఉద్యోగ విషయంలో శుభవార్తలు అందుతాయి.

కన్య: ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. భూ క్రయ విక్రయాలలో అనుకూల ఫలితాలుంటాయి. కుటుంబ సభ్యులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులలో అవరోధాలు కలిగిన ధైర్యంగా పనులను పూర్తి చేస్తారు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి.

తుల: వృత్తి ఉద్యోగాలలో ఆశించిన స్థాన చలనాలుంటాయి. వ్యాపారపరంగా ఎదురైన అవరోధాలను అధిగమిస్తారు. ఆర్థిక వ్యవహారాలు కొంత ఆశజానాకంగా ఉంటాయి. సంతానం విద్యా విషయాలలో శుభవార్తలు అందుకుంటారు. దూర ప్రాంతాల బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది.

వృశ్చికం: వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుతాయి. స్థిరాస్తి క్రయవిక్రయాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. సోదరుల నుండి ఊహించని ఆర్థిక సహాయం అందుతుంది. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కారమై మానసిక ప్రశాంతత పొందుతారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

ధనస్సు: వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. సన్నిహితుల నుండి విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. దీర్ఘకాలిక ఋణాల నుండి బయటపడతారు. వ్యాపారములు అనుకూలంగా సాగుతాయి.

మకరం: ఉద్యోగులకు అధికారుల అనుగ్రహం కలిగి హోదాలు పెరుగుతాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలను ప్రారంబించి సకాలంలో పూర్తిచేస్తారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

కుంభం: దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరానికి డబ్బు అందుతుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి. సంతాన విద్యా వివాహ ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

మీనం: గృహమున పెద్దల నుండి ప్రశంసలు పొందుతారు. చిన్ననాటి మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఆలోచనలు కలసివస్తాయి. ముఖ్యమైన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది.

# అమ్మగా ఆలనాపాలన...

## తెలంగాణ ప్రజలకు అమ్మనవుతా

**రెండేళ్ల తర్వాత ముఖ్యమంత్రినవుతా.. తెలంగాణ 'ఆత్మ'ను కాపాడతా**

**ఐదు అంశాలే ప్రధానంగా మేనిఫెస్టో.. పార్టీ పేరు, జెండా ఆవిష్కరణ**

**బీఆర్ఎస్ తప్పుల్లో భాగమయ్యా అందుకు సిగ్గుపడుతున్నా**

**పార్టీ ఆవిర్భావ సభలో కల్వకుంట్ల కవిత**





మేడ్చల్, ఏప్రిల్ 25 (ఈవార్తలు): తెలంగాణలో మరో రాజకీయ పార్టీ పుట్టుకొచ్చింది. కల్వకుంట్ల కవిత శనివారం కొత్త పార్టీ ప్రకటించారు. తన పార్టీకి టీఆర్ఎస్(తెలంగాణ రాష్ట్ర సేన)గా ఆమె నామకరణం చేశారు. శనివారం మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగిన ఆవిర్భావ సభ వేదికగా ఈ ప్రకటన వెలువడింది. పార్టీ ప్రకటన అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'మన పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేన. తెలంగాణ ప్రజలు, మేధావులు, బుద్ధి జీవులు, తెలంగాణ అభివృద్ధి కోరుకునే వారికి హృదయపూర్వక ధన్యవాదాలు. నా జీవితంలో ఇదొక మరుపురాని రోజు. మనందరం కలుసుకొని పనిచేసే విధంగా ఆ దైవం చేసిందని నమ్ముతున్నా. తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు, అనేక రకాల కష్టాలు పడిన, రాష్ట్ర వస్తే చాలని భావించిన వాళ్లకు నమస్కారం. సింగరేణి కార్మికులంటే ఇష్టం, అంతకన్నా ఆడబిడ్డలంటే ఇంకా ఇష్టం. జెన్ జీ వారసులు, యూత్ కు పేరు పేరున నమస్కారం. ఏం జరుగుతుందని ఇవ్వాళ రాష్ట్రంలో చాలా మంది ఎదురుచూస్తున్నారు. 20 ఏళ్లుగా నేను, తెలంగాణ జాగృతి పోషించిన పాత్ర మీకు తెలుసు. ఆడబిడ్డలందరినీ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనేలా ఊరురా బతుకమ్మ కార్యక్రమం ద్వారా చేశాం. జాగృతి ఆడబిడ్డల చేతిలో కాగడ అయ్యింది. మన సంస్కృతి గురించి చెప్పుకోవటానికి బతుకమ్మ వచ్చాక బలం వచ్చింది. ఇది మా సంస్కృతిని అని బతుకమ్మ పాట ద్వారా పున పరిచయం చేసకున్నాం. తెలంగాణ ఉద్యమానికి బలమైన పునాది వేసింది మా జాగృతి ఆడబిడ్డలు. కష్టపడి తెలంగాణ తెచ్చుకున్నాం. కానీ మనం కలలు కన్నా తెలంగాణ రాలేదు. మన కలలు ఇప్పటికీ కూడా నిజం కాలేదు. కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పింది. సామాజిక రథ చక్రం విరిగి ముక్కలైంది. ఏ తరహాలో పనిచేయాలో అలా జరగలేదని చెప్పటానికి బాధగా ఉంది. ఇసుక దందా మీద ప్రేమతో దళితుల చావులు అయ్యాయి. ఫోన్ మాట్లాడాలంటే భయం. దారుణమైన నిఘా నీడలో మనం బతికాం. మనం అనుకున్న తెలంగాణ రాలేదని మీకు చెబుతున్నా. ఆనాడు పరిపాలించిన కుటుంబంలో భాగమైనందుకు సిగ్గుపడుతున్నా. తెలంగాణ సాధించటంలో భాగమైనందుకు నా జన్మ ధన్యమైంది. నా తప్పులకు భాగస్వామ్యం ఉందన్న దానికి కేవలం క్షమాపణ చెబితే సరిపోదు. ఆ తప్పులను దిద్దుకోవటానికి కష్టపడి పనిచేయాలి. అందుకోసమే మేము తెలంగాణ రాష్ట్ర సేన గా వస్తున్నాం. పోరాటాలకు రాజకీయ శక్తి, అధికారం ఉంటే ఇంకా బాగా పనిచేయవచ్చు. అందుకోసమే ఈ పార్టీ మీ ముందుకు వచ్చింది. రాజకీయ పార్టీకి రాజకీయ ఆత్మ ఉండాలి.

అజెండా ఉండాలి. బీఆర్ఎస్ అనే పార్టీ తెలంగాణ ఆత్మ కోల్పోయింది. అందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది. తెలంగాణలోని మూడు కోట్ల మందికి ఒక అమ్మలాగా పరిణితి చెందాలని అనుకుంటున్నా. అమ్మతనంతో, ఆర్థితో పాలన జరిగినప్పుడే కష్టాలు తీరుతాయి. రైతాంగ పోరాటం, ముల్కీ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం ఇలా సాగుతూనే ఉంది. చాకలి ఐలమ్మ, గద్దరన్న, మారోజు వీరన్న సహా అనేక మంది పోరాటం చేస్తేనే ఇలా మార్పులు వచ్చాయి. అమర వీరులు, కేసీఆర్ గారు అనేక మంది కొట్లాడితేనే తెలంగాణ వచ్చింది. సమ్మక్క సారక్క నాటి నుంచే సామాజిక పోరాటం జరిగింది. కొండ లక్ష్మణ్ బాపూజీ, పాపన్న గౌడ్, పంతు నాయక్ గారు, జనార్ధన్ రావు గారి స్ఫూర్తిని తీసుకుంటాం. రాజ్యాంగ బద్ధంగా రాజకీయ శక్తితో ప్రజాపోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణను సాధిస్తాం. తెలంగాణ రాష్ట్ర సేన మీ ముందుకు ఊరికే రాలేదు. బీజేపీ కి తెలంగాణ రావటమే ఇష్టం లేదు. తల్లిని చంపి బిడ్డను తీశారని బీజేపీ పెద్దలు అంటారు. మెడకాయ మీద తలకాయ లేని ఒక ఎంపీ తెలంగాణను భారత్ పాక్ విభజనతో పోల్చుతారు. అగ్రనాయకత్వం అలా మాట్లాడితే బీజేపీ బానిస ఎంపీలు ఒక్క మాట్లాడరు. మనకు ఒక్క రూపాయి ఇవ్వకపోయిన సరే మన బీజేపీ ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయం అనే దానికే బద్ధ వ్యతిరేకి బీజేపీ. మహిళ బిల్లు పక్కన పెట్టారు. బీసీ బిల్లు, కులగణన బిల్లు తొక్కి పెట్టారు. పేదలకు కూడు పెట్టే ఉపాధి హామీని పక్కన పెట్టారు. ఫెడరల్ స్ఫూర్తిని పక్కన పెట్టి మన ఏడు మండలాలు తీసుకున్నారు. అయిన సరే ఈ బీజేపీ బానిస ఎంపీలు పెదవులు తెరవరు. ఈ బీజేపీ బానిస ఎంపీలకు నేను సవాల్ చేస్తున్నా . మీరు తెలంగాణ బిడ్డలైతే భద్రాచలం వద్ద ఐదు గ్రామాలను తెలంగాణకు పట్టుకురండి. పోలవరం పూర్తయితే ఆ గ్రామాలు మునిగిపోతాయి. దానిపై జాగృతి తరఫున మేము మాట్లాడాం. ఆంధ్రా వారికి, కేంద్రానికి లేఖ రాశాం. మీకు సిగ్గు ఉంటే రాముని గుడి మునిగిపోకుండా ఐదు గ్రామాలు తెలంగాణకు తేవాలి. బీఆర్ఎస్ పార్టీ నుంచి తొట్ట తొలి ముఖ్యమంత్రి అయ్యారు. మంచి సాలు తీయాల్సింది. నీళ్లు, నిధులు, నియామాకాలు అనే నినాదంతో తెచ్చుకున్నాం. పదేళ్లలో నీళ్ల కోసం బీఆర్ఎస్ లక్షా 89 వేల కోట్లు ఖర్చు చేసింది. కానీ 14 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చింది. పాలమూరు, కాళేశ్వరం కోసమే లక్షా 21 వేల కోట్లు ఖర్చు చేసింది. ఈ విషయాన్ని నేను బాధతో చెబుతున్నా. ఆనాటి కేసీఆర్ వేరు, ఈనాటి కేసీఆర్ వేరు. ఆనాడు చేనేత కార్మికులు చనిపోతే భిక్షమెత్తి సాయం చేసిన వ్యక్తి కేసీఆర్. ఈనాటి కేసీఆర్ మరమనిషి, మారిన మనిషి. వెలుగుమట్లలో, హైడ్రాలో ఇళ్లు కూలితే వచ్చారా, అయ్యా కేసీఆర్ రావాలి అంటే కూడా రాలేదు. చేవెళ్ల దగ్గర కష్టమొస్తే వచ్చారా? ఆయన మారిన మనిషి, మర మనిషి. మన మనిషి కాదు. గుంటనక్కలు, తోడేళ్లలో ఖైదీ అయిన మర మనిషి. దుఃఖంతో చెబుతున్న మాటలు ఇవి. సంతోషంతో కాదు. ఆర్డీఎస్ కోసం పాదయాత్ర చేశారు. కానీ పాలమూరు కోసం ఏం చేయలేదు. ఆనాటి కేసీఆర్ అయితే అక్కడే కుర్చీ వేసుకొని దాన్ని పూర్తి చేసేవారు. కానీ మారిన కేసీఆర్ మాత్రం పంజాబ్, గుజరాత్, బీహార్‌కు పోయారు. రాష్ట్రంలో మొత్తం పీకి కట్టలు కట్టామని, నేషనల్ పార్టీ అంటూ పోయారు. కానీ తెలంగాణ ప్రజలను పట్టించుకోలేదు. పట్టించుకోని ఉంటే పాలమూరు రంగారెడ్డి పారకపోయేదా? నేను ఎన్ని మాట్లాడిన బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెబుతలేరు. దీనికి సమాధానం చెప్పకపోతే ప్రజలే మిమ్మల్ని బయటకు లాగి సమాధానం చెప్పేలా చేస్తుంది. సింగరేణి గనిలో కార్మికుడు చనిపోతే చూసి వచ్చిన వ్యక్తి.. తెలంగాణ వచ్చాక ఏమైంది ఆ ప్రేమ? అధికారం ముందు మమకారం తగ్గిపోయిందా? నాకు తండ్రి కావచ్చు అది వేరే విషయం. కేసీఆర్ రాజకీయ పరిణితి కోల్పోయి మాట్లాడుతున్నారు.

జూకేటీఆర్ అంటే ఆయనకు పెద్దగా తెలియదు. ప్రజలు తప్పు చేశారని కేసీఆర్ అంటున్నారు. నా పిల్లలు తప్పు చేస్తే నేను వదిలివేస్తానా? ఇక రాష్ట్రంలో ఒక కర్కోటక పాలకుడి పాలన నడుస్తోంది. అర్ధరాత్రి ఇండ్లు కూలగొడుతుంటే ఆదుకోవాల్సిన మన పాత కేసీఆర్ ఎక్కడ ఉన్నాడు? నన్ను పార్టీ నుంచి బయటకు పంపిస్తే వెంటనే పార్టీ పెట్టలేదు. మారుతారేమోనని చాలా రోజులు వేచి చూశా. ఆనాడు ఉద్యమకారులకు జరిగింది. ఇప్పుడు నాకు జరిగింది. కేసీఆర్ కోసం ఇళ్లు, భూములు అమ్ముకున్న వాళ్లు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? తెలంగాణ ఉద్యమంలో మనల్ని లాఠీలతో కొడితే తల్లి కోడిలా కాపాడుకోవాల్సిన కేసీఆర్ ఎక్కడ పోయిండు? పదేళ్లలో 2 ఏండ్లకు ఒకసారి నామినేషన్ పదవులు ఇచ్చిన సరే 30 వేల పదవులు వస్తుండే. ఆనాడు అవహేళన చేసిన వారే అధికారంలో వచ్చిన తర్వాత మళ్లీ అవహేళన చేశారు. ఎప్పుడైతే అధికారం వచ్చిందో అప్పుడే అమ్మతనం, మమకారం పోయింది. అందుకే అంటున్న ఆయన మన కేసీఆర్ కాదు మారిన మర మనిషి కేసీఆర్. అందుకే నేను ఈ పార్టీ పెట్టి వస్తున్నా. ఈ గడ్డకు ఏమీ జరిగిన ప్రాణం అడ్డుపెట్టి పనిచేసే వాళ్లు కావాలి. అవినీతి జరిగిందని అని చెప్పిన నన్ను సస్పెండ్ చేసి అవినీతి చేసిన పందికొక్కులను పక్కన పెట్టుకున్నారు. ఆత్మ లేని మరబొమ్మ కేసీఆర్. ఇవ్వాళ మన కేసీఆర్ కాదు. అందుకే ఎదురుగా నిలబడి కొట్లాడుతున్న నాతో పాటు వస్తారా? ఇప్పుడు ఇళ్లు మాత్రమే అలికం. ముందున్నది ముసళ్ల పండగ. ఇవ్వాళ రాష్ట్రంలో ఒక కర్కోటకుడి పాలన నడుస్తోంది. వెలుగుమట్లలో అన్ని పర్మిషన్లు ఉన్నప్పటికీ ఇళ్లను కూలగొడితే బాధతో ఒక గర్భిణీకి అబార్షన్ అయ్యింది. ఆ గర్భిణీ తండ్రి రోదన ఇంకా కళ్ల ముందు మెదులుతోంది. అందుకే కర్కోటకుడు, నియంత అంటా. రెండు నెలల చిన్నారి చనిపోతే ఇప్పటికీ కూడా కేసు పెటట్టం లేదు. గురుకులాల్లో విషం పెట్టి పిల్లలను చంపితే ఈ ముఖ్యమంత్రి పట్టించుకోవటం లేదు. కర్ల రాజేశ్ అనే యువకుడిని లాకప్ డెత్ చేస్తే ఇప్పటికీ కేసు పెట్టలేదు. కాంగ్రెస్ మీద కచ్చితంగా మనమే పోరాటం చేస్తాం. ఇప్పుడు మనమే ప్రధాన ప్రతిపక్షం. రెండేళ్ల తర్వాత అధికారంలోకి వస్తాం. ఇప్పుడున్న మూడు పార్టీలు కుటుంబ పాలన, అవినీతి, బంధుప్రీతి తో నిండిపోయాయి. మనం ఐదు అంశాలపై పోరాటం చేద్దాం. పాంచజన్యం మాదిరిగా మనం ముందుకు పోవాలి. మొదటిది విద్య. ఆ రోజు కేసీఆర్ గారు ప్రభుత్వ పాఠశాలలను మూసేశారు. ప్రభుత్వ స్కూల్ లో కనీస సదుపాయాలు లేవు. గుడిని ఎంత పవిత్రంగా చూస్తామో...బడిని అంతే పవిత్రంగా చూడాలి. ప్రతి ఊరిలో బడి ఉండాలే, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. మన ప్రభుత్వం వస్తుంది. నేను మీ అమ్మను. నేను జేబు చూడాను. కడుపు చూస్తాను. ప్రైవేట్ పాఠశాలలో చదివినా సరే ఒక్క రూపాయి భారం పడకుండా ఉచిత విద్య బాధ్యత తీసుకుంటాం. ప్రాథమిక విద్య నుంచి పీహెచ్డీ వరకైనా సరే ఉచిత విద్య ఇస్తాం. గతంలో రక్తం అమ్ముకునేవాళ్లు ఇప్పుడు గిగ్ వర్కర్లుగా విద్యార్థులు పనిచేస్తున్నారు. ఎంత వరకు చదువుకున్న సరే వారికి రూపాయి కూడా భారం కానివ్వం. ఎంత పెద్ద రోగం అయినా సరే రూపాయి కూడా భారం కానివ్వం. ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తే తెలంగాణ బిడ్డలే డబ్బులు సంపాదించి ప్రభుత్వానికి ఇస్తారు. మూడోది రైతు. రైతులకు అరసు పాట పాడినట్లు అంత ఇస్తాం, ఇంత ఇస్తామంటారు. నేను రైతును అని గర్వంగా చెప్పుకునేలా చేస్తాం. ఏ ప్రభుత్వ ఆఫీస్ కు వెళ్లిన సరే రైతును గౌరవించేలా చేస్తాం. 24 గంటల విద్యుత్, యూరియ ఇలా అన్ని విషయాల్లో వారికి న్యాయం చేస్తాం. రైతునే రాజు చేసే విధంగా మేము చేస్తాం. ఇక నాలుగో అంశం ఉపాధి. అన్ని ప్రభుత్వాలు ఉపాధి కల్పిస్తామని చెబుతుంటారు. ఉపాధి అంటే కేవలం ఉద్యోగం కాదు. మీరు ఒక ఆలోచన తో వస్తే 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు మీ అమ్మ ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుంది. నా యూత్ ను నేను నమ్ముతున్నా. డైరెక్ట్ గా వారికి మేము రుణాలు ఇస్తాం. ఉద్యోగం చేయాలనుకునే వారికి ఒక గుడ్ న్యూస్. మేము అధికారంలోకి వస్తే మొదటి సంవత్సరంలోనే ఒక నోటిఫికేషన్ ద్వారా 4 లక్షల ఉద్యోగాలు ఇస్తాం. మన ఉద్యమకారులు వారి వయసు, రక్తాన్ని ఉద్యమం కోసం ధారబోశారు. వారికి జూన్ 2, 2014 ను కటాఫ్ తేదీగా పెట్టుకొని లక్ష సూపర్ న్యూమరరీ జాబ్స్ ను క్రియేట్ చేస్తాం' అని పేర్కొన్నారు.



### జెండాలో పసుపు, నీలం, ముదురు ఆకుపచ్చ

తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) జెండా పసుపు, నీలం, తెలుపు రంగులతో రూపుదిద్దుకుంది. పసుపు రంగులో జెండా మొత్తం ఉంటే.. అందులో తెలంగాణ మ్యాప్ ఉంది. ఆ మ్యాప్ నీలం రంగులో ఉంది. మద్యలో, కింద ముదురు ఆకుపచ్చ కలర్ స్ట్రిప్ లో టీఆర్ఎస్, తెలంగాణ రాష్ట్ర సేన అనే అక్షరాలు తెలుపు రంగులో ఉన్నాయి.

## 'టీఆర్ఎస్' పేరుకు దిగువన 'అసోసియేషన్'.. ఎందుకు?

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఈవార్తలు): కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో తన పార్టీని శనివారం ప్రకటించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మునీరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె పార్టీ ప్రకటన చేశారు. పాతిక సంవత్సరాల క్రితం తన తండ్రి కేసీఆర్ స్థాపించిన 'టీఆర్ఎస్' అని వచ్చేలా ఆమె తన పార్టీ పేరును ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చారు. క్లుప్తంగా కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్‌ను పోలేలా తన పార్టీ పేరు ఉండేలా కవిత చూసుకున్నారు. కవిత తన పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రకటించినప్పటికీ, దాని కింద చిన్న అక్షరాల్లో 'అసోసియేషన్' అని కనిపించింది. ఈ అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్‌ను పోలిన నేపథ్యంలో లీగల్ సమస్య రాకుండా ఉండేందుకు కింద అసోసియేషన్ అని చేర్చినట్లు తెలుస్తోంది.



# తెలంగాణ 'ఆత్మ'.. కవిత అస్త్రం

## మూలాలే పట్టుగొమ్మలుగా టీఆర్ఎస్ అధినేత్రి పావులు.. ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడేందుకు మరో ముందడుగు

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ప్రస్తుతం ఒక కీలక మలుపులో ఉంది. ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడిన గడ్డపై, ఇప్పుడు 'తెలంగాణ ఆత్మ'ను కాపాడే నాథుడే లేడన్న ఆందోళన సామాన్య ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత తీసుకున్న నిర్ణయం చాలా గొప్పది. తెలంగాణ సమాజం ఇప్పుడు ఒక విలక్షణమైన శూన్యతను అనుభవిస్తోంది. దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న రాష్ట్రంలో, తెలంగాణ అస్తిత్వం మళ్లీ ప్రశ్నార్థకమవుతోంది. ఒకప్పుడు ఉద్యమానికి ఊపిరి పోసిన పార్టీలు, నేడు తమ మూలాలను విస్మరించి రాజకీయ చదరంగంలో పావులుగా మారుతుండటం విచారకరం. రాష్ట్ర ఆవిర్భావానికి వెన్నెముకగా నిలిచిన బీఆర్ఎస్, జాతీయ రాజకీయాల మోజులో పడి తన పేరులోని 'తెలంగాణ'ను తొలగించుకున్నప్పుడే ఆ పార్టీ 'ఆత్మ'ను కోల్పోయిందన్న విమర్శలు మొదలయ్యాయి. ఉద్యమ కాలం నాటి ఆవేశం, ప్రాంతీయ గౌరవం నేడు ఆ పార్టీలో నీరసించిపోయాయి. మరోవైపు, అధికారంలో ఉన్న కాంగ్రెస్ తన అధిష్టాన సంస్కృతిని వీడలేకపోతోంది. రాష్ట్ర ప్రయోజనాల కంటే ఢిల్లీ పెద్దల ప్రసన్నమే ముఖ్యం అన్నట్టుగా సాగుతున్న పాలనలో తెలంగాణ స్వయం ప్రతిపత్తి కనుమరుగవుతోంది. ఇక బీజేపీ తీరు మరింత విస్మయానికి గురిచేస్తోంది. మొన్నటివరకు తెలంగాణపై ఎన్నో ఆశలు పెంచుకున్న ఆ పార్టీ, ఇప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితులకు దూరమైంది. ముఖ్యంగా ఎంపీ తేజస్వీ సూర్య వంటి నేతలు తెలంగాణ సంస్కృతిని, ఇక్కడి పరిస్థితులను తక్కువ చేస్తూ చేసిన వ్యాఖ్యలు తెలంగాణవాదుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఉత్తరాది రాజకీయ ముద్రను ఇక్కడ రుద్దే ప్రయత్నం తెలంగాణ అస్తిత్వానికి సవాలుగా మారింది. ఇలాంటి సంక్లిష్ట సమయంలో, "తెలంగాణ ఆత్మను కాపాడతానంటూ" కవిత ముందుకు రావడం గమనార్హం. పార్టీలు జాతీయ వాదం వైపు మొగ్గ చూపుతున్న వేళ, తిరిగి ప్రాంతీయ అస్తిత్వాన్ని, తెలంగాణ సంస్కృతిని భుజానకెత్తుకుంటానని ఆమె ప్రకటించడం స్వాగతించదగ్గ పరిణామం. బతుకమ్మ వంటి పండుగలను విశ్వవ్యాప్తం చేయడంలో ఆమె పోషించిన పాత్ర ఇప్పటికే ప్రజల్లో గుర్తింపు పొందింది. రాజకీయాలు ఎన్నికల చుట్టూ తిరగవచ్చు, కానీ ఒక ప్రాంతపు ఆత్మ గౌరవం ఆ ప్రాంతపు సంస్కృతి, భాష, మట్టిపై ఉంటుంది. ఢిల్లీ గుమ్మం దగ్గర తెలంగాణ ఆత్మగౌరవం తాకట్టు పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత నేటి నాయకత్వంపై ఉంది. ఆ అస్తిత్వాన్ని కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా ఎవరు ముందుకొచ్చినా తెలంగాణ సమాజం వారిని అభినందిస్తుంది.



# తండ్రికి తగ్గ తనయ

## మొండి ధైర్యమే ఇద్దరి ఆయుధం.. తండ్రి నుంచి వచ్చిన లక్షణం పోరాటం

(ఈవార్తలు - పొలిటికల్ డెస్క్)

శూన్యంలో కూడా అఖండ వెలుగును పుట్టించగల నాయకుడు కేసీఆర్. తెలంగాణ రాజకీయాల్లో 'మొండితనం' అనే పదానికి కేసీఆర్ ఒక కొత్త అర్థాన్ని ఇచ్చారు. నాడు అసాధ్యమనుకున్న తెలంగాణ స్వరాష్ట్ర కలను తన పట్టుదలతో సుసాధ్యం చేసిన ఆయన శైలి ఇప్పుడు ఆయన తనయ కల్వకుంట్ల కవితలో కనిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ చరిత్రలో కేసీఆర్ వేసిన ముద్ర చెరపలేనిది. అప్పట్లో కాంగ్రెస్, టీడీపీ వంటి దిగ్గజ పార్టీలను ఎదిరించి, గుప్పెడు మందితో బయలుదేరిన ఆయన ప్రస్థానం ఒక అద్భుతం. ఆయనలో ఉన్న అతిపెద్ద బలం 'మొండి ధైర్యం'. విమర్శలు ఎదురైనా, అవహేళనలు చేసినా వెనకడుగు వేయని ఆయన శైలే ప్రత్యేక తెలంగాణను సాకారం చేసింది. ఇప్పుడు అదే రకమైన మొండి పట్టుదలతో కవిత తనకంటూ ఒక సొంత రాజకీయ మార్గాన్ని ఎంచుకోవడం గమనార్హం. కేసీఆర్ రాజకీయం ఎప్పుడూ ఒక వ్యూహం ప్రకారం సాగుతుంది. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా దాని వెనుక ఒక బలమైన కారణం, పటిష్టమైన సంకల్పం ఉంటాయి. ఇప్పుడు కవిత కొత్త పార్టీ దిశగా అడుగులు వేయడం వెనుక కూడా అదే తరహా 'మొండితనం' కనిపిస్తోంది. రాజకీయ సవాళ్లు చుట్టుముట్టిన వేళ, విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో కుంగిపోకుండా, పోరాడేందుకే సిద్ధపడటం తండ్రి నుంచి ఆమె పుణికిపుచ్చుకున్న లక్షణం. కేసీఆర్ ఉద్యమ సమయంలో ఎదుర్కొన్న ఒత్తిళ్లు అన్నీ ఇన్నీ కావు. కానీ ఆయన తన లక్ష్యం వైపే దృష్టి సారించారు. కవిత సైతం ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవడం ఆమె ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. తండ్రికి 'తెలంగాణ సెంటిమెంట్' ఎలాగైతే ఆయుధమైందో, కవిత కూడా తన పోరాట పంథాలో ప్రజల సమస్యలను, ముఖ్యంగా మహిళా సాధికారతను తన అజెండాగా మార్చుకుంటోంది. రాజకీయాల్లో మొండితనం అనేది ఒక రెండు వైపుల పదునున్న కత్తి. అది సరైన లక్ష్యం వైపు సాగితే అద్భుతాలు సృష్టిస్తుంది. కేసీఆర్ తన మొండితనంతో చరిత్రను తిరగరాశారు. మరి అదే పట్టుదలతో రాజకీయ రణక్షేత్రంలోకి దిగుతున్న కవిత, తండ్రి వారసత్వాన్ని అంతే ఘనంగా కొనసాగించేలా ఉన్నారు. సంకల్పం గట్టిదైతే, మార్గం ఏదైనా విజయం సాధ్యమేనని కేసీఆర్ నిరూపించారు. ఇప్పుడు కవిత ఆ బాటలో పయనిస్తున్నారు.

# పాత కేడర్‌కు కవిత గాలం

## ఆత్మాభిమానం అంటూ ప్రజల్లోకి

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఈవార్తలు): మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో కవిత తన రాజకీయ నూతన ప్రస్థానాన్ని ప్రారంభించారు. వేలాదిగా తరలివచ్చిన మహిళా కార్యకర్తల మధ్య 'తెలంగాణ రాష్ట్ర సేన' జెండాను ఆమె ఆవిష్కరించారు. గతంలో బీఆర్ఎస్‌గా మారిన టీఆర్ఎస్ పేరును పోలి ఉండేలా తన పార్టీ పేరును 'టీఆర్ఎస్' అని ప్రకటించడం వెనుక పాత కేడర్‌ను ఆకట్టుకునే వ్యూహం ఉందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా మహిళా సాధికారత, తెలంగాణ ఆత్మగౌరవం నినాదాలతో కవిత ఈ కొత్త అస్త్రాన్ని బయటకు తీశారు. పార్టీ ఆవిర్భావ సభకు ముందే కవిత గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించడం ద్వారా సెంటిమెంట్ రాజకీయానికి తెరతీశారు. అమరవీరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో నేడు హక్కులు కాలరాయబడుతున్నాయని, వాటి పరిరక్షణ కోసమే తాను ఈ కొత్త బాధ్యతను తీసుకున్నట్లు ఆమె ప్రకటించారు. అయితే, ఇప్పటికే గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు, కవిత తీసుకున్న ఈ నిర్ణయం ఊహించని షాక్ అని చెప్పవచ్చు. గులాబీ బాస్ కేసీఆర్ ఉద్యమ పార్టీని జాతీయ స్థాయికి తీసుకెళ్లే క్రమంలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చినప్పుడు గ్రౌండ్ లెవల్‌లో ఒక రకమైన శూన్యం ఏర్పడింది. కవిత సరిగ్గా ఆ పాయింట్‌ను క్యాష్ చేసుకోవాలని చూస్తున్నారు. టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారినప్పుడే ఆ పార్టీ తెలంగాణ ఆత్మను కోల్పోయిందని విమర్శిస్తూ.. మళ్ళీ అదే సెంటిమెంట్‌ను తెరపైకి తీసుకొచ్చేందుకు టీఆర్ఎస్ అనే పేరు వచ్చేలా తన పార్టీకి తెలంగాణ రాష్ట్ర సేన అనే పేరును ఎంచుకున్నారు. బీఆర్ఎస్ కోర్ ఓటు బ్యాంకును, ముఖ్యంగా పాత టీఆర్ఎస్ అభిమానులను తన వైపు తిప్పుకునే ఒక మాస్టర్ ప్లాన్‌గా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పేరు సంగతి అటుంచితే కవిత పార్టీకి కేటాయించబోయే గుర్తుపై ప్రస్తుతం చర్చ నడుస్తోంది. కేంద్ర ఎన్నికల కమిషన్ కవిత పార్టీకి ఏ గుర్తు కేటాయిస్తుందనేది ఇప్పుడు అత్యంత కీలకం. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 'కారు' గుర్తును పోలిన ఇతర గుర్తుల వల్ల భారీ నష్టం వాటిల్లింది. రోడ్డు రోలర్, చపాతీ రోలర్, కెమెరా, షిప్ వంటి గుర్తులు ఈవీఎం మిషన్లపై కారు గుర్తును పోలి ఉ



ండటంతో వృద్ధులు, గ్రామీణ ఓటర్లు అయోమయానికి గురై ఆయా గుర్తులకే ఓట్లు వేశారు. దీనివల్ల అనేక నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు కవిత పార్టీకి గనుక కారును పోలిన గుర్తు కేటాయిస్తే.. బీఆర్ఎస్‌కు తీవ్ర నష్టం చేకూరుస్తుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కవిత ఇప్పటికే టీఆర్ఎస్ పేరు ద్వారా బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టేందుకు ఎత్తు వేశారని.. ఒకవేళ ఆమెకు కేటాయించే గుర్తు కూడా కారు ఆకారంలోనో, దానికి దగ్గరగానో ఉంటే ఓటు బ్యాంకు చీలిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. బీఆర్ఎస్ పార్టీకి పడాల్సిన ఓట్లు, పొరపాటున కవిత పార్టీకి పడితే అది పరోక్షంగా కాంగ్రెస్ లేదా బీజేపీ వంటి ఇతర ప్రధాన పార్టీలకు లాభం చేకూరుస్తుందని చెబుతున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ కారు గుర్తును పోలిన గుర్తులపై బీఆర్ఎస్ ఈసీకి ఫిర్యాదు చేస్తూనే ఉందనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. తెలంగాణలో ఇప్పటికీ కారు, టీఆర్ఎస్ అంటే వేర్వేరు కావనే అభిప్రాయం ఉంది. ప్రజల మనసులో టీఆర్ఎస్ అంటేనే కారు గుర్తు అని బలంగా నాటుకుపోయి ఉంది. ఇప్పుడు కవిత టీఆర్ఎస్ పేరును తన సొంతం చేసుకున్నారు. రేపు ఎన్నికల గుర్తు కారును పోలేలా, ప్రజలను కన్ఫ్యూజ్ చేసేలా ఉంటే బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

### కవిత డూప్లికేట్ పార్టీ: బీఆర్ఎస్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ కల్వకుంట్ల కవిత ప్రకటించిన కొత్త పార్టీ 'తెలంగాణ రాష్ట్ర సేన'పై సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ సంధించిన సెటైరికల్ బాణాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. సొంత కుటుంబం నుంచే కొత్త కుంపటి మొదలవ్వడం ఒక ఎత్తయితే, పాత పేరును తలపించేలా 'టీఆర్ఎస్' అనే పేరును ఎంచుకోవడంపై గులాబీ శ్రేణులు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నాయి. కవిత పార్టీ పేరును ప్రకటించిన కొద్దిసేపటికే బీఆర్ఎస్ అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఒక ఆసక్తికరమైన పోస్ట్ ప్రత్యక్షమైంది. "ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే!" అనే క్యాప్షన్‌తో కోల్గేట్, బిస్లరీ వంటి బ్రాండెడ్ ఉత్పత్తులు.. వాటిని పోలి ఉండే నకిలీ ఫోటోలను షేర్ చేసింది. తెలంగాణలో టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి) అన్న పేరుకు ఉన్న బ్రాండ్ ఇమేజ్‌ను వాడుకునేందుకు కవిత ప్రయత్నిస్తున్నారనే అర్థం వచ్చేలా ఈ సెటైర్ వేశారు. రాష్ట్రం కోసం పోరాడిన అసలైన తెలంగాణ పార్టీ తమదేనని, ఈ కొత్త పార్టీ కేవలం అనుకరణ మాత్రమేనని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ఎద్దేవా చేసింది.

### బీఆర్ఎస్‌కు తోక పార్టీనే: కాంగ్రెస్

కల్వకుంట్ల కవిత 'తెలంగాణ రాష్ట్ర సేన'ను ప్రకటించిన కొద్దిసేపటికే రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ముఖ్యంగా ఆమె తన తండ్రి కేసీఆర్ ను 'మరమనిషి' అని సంబోధించడం, రేవంత్ రెడ్డిని పాలనను 'హిట్లర్ పాలన'తో పోల్చడం సంచలనంగా మారింది. కవిత టీఆర్ఎస్ పార్టీపై టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. కవిత పెట్టిన 'తెలంగాణ రాష్ట్ర సేన' స్వతంత్రమైనది కాదని, అది బీఆర్ఎస్ పార్టీకి ఒక 'తోక పార్టీ' మాత్రమేనని రామ్మోహన్ రెడ్డి అన్నారు. "తలా తోక ఎప్పటికీ ఒక్కటే... బాపు బీఆర్ఎస్ అంతర్భా గమే తనయ టీఆర్ఎస్.. అంతా గ్యాస్ " అని సెటైర్ వేశారు.


మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




### బడి.. గుడి.. గుడిసె

### అన్నీ లెక్కిస్తాం: భారతి హోళికెరె

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఈవార్తలు): జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికెరె జనాభా లెక్కల సేకరణ వివరాలను శనివారం మీడియాకు వివరించారు. తెలంగాణ భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని లెక్కిస్తామని ఆమె వెల్లడించారు. ప్రతి నిర్మాణాన్ని లెక్కలోకి తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రి, బడి, గుడి, గుడిసె, అద్దె భవనం ఇలా అన్నింటి గణన జరుగుతుందని వెల్లడించారు. అలాగే ఒక భవనం లేదా కాంప్లెక్స్‌లో ఉండే ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన మొదలయ్యేలోగా అన్నీ సిద్ధం చేస్తామని తెలిపారు. రెండో దశ జనగణనలో భాగంగా 2027 ఫిబ్రవరి నుంచి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తామని అన్నారు. ఇళ్ల గణన కోసం బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను కేటాయిస్తామని తెలిపారు. మే 11వ తేదీ నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి మార్కింగ్ చేస్తారని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి జనగణనకు సంబంధించిన యాప్ ద్వారా 33 ప్రశ్నలను అడిగి వాటిని పూరిస్తారని చెప్పారు. జనగణనకు సంబంధించి ఒక ఇంటి నుంచి ఒక మొబైల్ నెంబర్ తీసుకుంటామని చెప్పారు. భాషను, ఇంటి పెద్దల వివరాలు సరిగ్గా ఇవ్వాలని సూచించారు. మొబైల్ నెంబర్, భాష, ఇంటి పెద్ద పేర్లను ఒకసారి నమోదు చేస్తే, వాటిని మార్చడానికి వీలుండదని తెలిపారు.

### మే 9న తెలంగాణకు మోదీ

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరు**

**పరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో తెలంగాణలో పర్యటించనున్నారు. మే 9వ తేదీన ఆయన రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర పర్యటన ఖరారైంది. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారు. హైదరాబాద్ నగరంలోని పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక తెలంగాణకు రావడం ఇదే మొదటిసారి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన తెలంగాణకు వస్తారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఎంఎంటీఎస్ ఫేజ్-2ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్‌ను జాతికి అంకితం చేసే అవకాశముంది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేసే అవకాశముంది. కాగా, మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి హాజరవుతారా లేదా తెలియాల్సి ఉంది.



# జీవీఎన్ రాజుకు కాలిఫోర్నియా పబ్లిక్ వర్సిటీ డీ.లిట్ పట్టా

హైదరాబాద్, ఏప్రిల్ 25 (పీఐబీ)/న్యూఢిల్లీ: జీవన నైపుణ్యాల శిక్షణ, భావప్రసారం, ప్రదర్శన కళలలో ప్రత్యేకత సాధించినందుకుగానూ ప్రఖ్యాత జీవన నైపుణ్యాల శిక్షకుడు జీవీఎన్ రాజుకు డాక్టర్ ఆఫ్ లెటర్స్ (డి.లిట్) పట్టా దక్కింది. కాలిఫోర్నియా పబ్లిక్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో భాగంగా ఏప్రిల్ 24వ తేదీ మధ్యాహ్నం ఢిల్లీలో ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆసియా దేశాల యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ రఘునాథ్ పరాక్కల్ మరియు మడగాస్కర్ రాయబారి ఈ సర్టిఫికెట్‌ను అందజేశారు. రాజు 1991 నుండి వృత్తిపరమైన జీవన నైపుణ్యాల శిక్షకుడిగా, కార్పొరేట్ ట్రైనర్‌గా ఉన్నారు. విద్య, సాంస్కృతిక, ఫార్మా, జీవిత బీమా, బ్యాంకింగ్ మరియు రిటైల్ మార్కెటింగ్ సంస్థల వంటి వివిధ రంగాలకు విజిటింగ్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. ప్రభుత్వ మరియు స్వచ్ఛంద సంస్థలకు గెస్ట్ ఫ్యాకల్టీగా కూడా వ్యవహరిస్తున్నారు. జేసీఐ సేన్‌అర్ సునీల్ కుమార్ నాయకత్వంలో జేసీఐలో శిక్షణ పొంది, అమెరికాలోని జేసీఐ యూనివర్సిటీ నుండి అంతర్జాతీయ శిక్షణా ఫెలోషిప్‌ను పొందారు. రాజు బహుముఖ ప్రజ్ఞాశాలి. వక్తగా, ఉపన్యాసకుడిగా, మోడరేటర్‌గా, కవిగా వివిధ ఎలక్ట్రానిక్ మాధ్యమాలలో తన ప్రతిభను సమర్థంగా ఉపయోగిస్తున్నారు. ఆయన వివిధ జీవన నైపుణ్యాలపై 7 పుస్తకాలు రచించారు. తన గురువు డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ మార్గదర్శకత్వంలో, తెలుగు విశ్వవిద్యాలయంలో వెంటిలోక్విజంలో అంతర్జాతీయ కళాకారుడు, శిక్షకుడిగా పనిచేశారు. కేంద్ర ప్రభుత్వంలో పనిచేసి, ఆ తర్వాత వివిధ బహుళజాతి కంపెనీలలో శిక్షణా విభాగాధిపతిగా సేవలందిస్తూ భారతదేశంలో వేల మందికి శిక్షణ ఇచ్చారు.

# కేసీఆర్ లేకుంటే తెలంగాణే ఉండేదా?

## కవిత.. నీ మాటలు ఉపసంహరించుకో: బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఈవార్తలు): మర మనిషి మాటను కవిత ఉప సంహరించుకోవాలని, రాష్ట్రానికి పట్టిన పీడ, శనిని తొలగించేందుకు ఉద్యమించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. శనివారం జగిత్యాల పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపి కవిత పార్టీ ఏర్పాటు సందర్భంగా కేసీఆర్ తో ఉన్న అనుబంధం, ఆత్మీయతను మరిచి, కుటుంబ సభ్యురాలిగానే కాకుండా, ఉద్యమ నేత అయిన కేసిఆర్ ను మర మనిషి అనటం సరికాదన్నారు. 2001లో కేసిఆర్ ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా టీఆర్ఎస్ పార్టీ నీ స్థాపించి సమాజాన్ని జాగృతం చేసి, అన్ని పార్టీలను ఏకం చేసి తెలంగాణ సాధించారన్నారు. కేసీఆర్ తో మాత్రమే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సాధ్యమైందని, కవిత కూడా తెలంగాణ ఉద్యమ బలోపేతానికి జాగృతి ద్వారా, ప్రజలను జాగృతం చేశారన్నారు. బిఆర్ఎస్ తో విభేదాలు రావచ్చని, గత వాస్తవాలను విస్మరించడం సరైంది కాదన్నారు. కేసిఆర్ వంటి గొప్పమనసున్న మనిషిని మర మనిషిగా పేర్కొనడం సరి కాదన్నారు. కేసీఆర్ కు హృదయం లేకుంటే ఇవాళ తెలంగాణ రాష్ట్రం లేదని, కాళేశ్వరం పాలమూరు రంగారెడ్డి, ఆర్డిఎస్ తోపాటు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలను ఊహించలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సాధ్యం కాలేని పరిస్థితిలో ప్రాణహిత నది జలాల వినియోగానికి మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజ్ తో రాష్ట్రవ్యాప్తంగా నీరు సరఫరాకు మార్గం సుగమమైందన్నారు. కవిత ఐదు హామీలను ప్రకటించారని, వాటిలో ప్రత్యేకత ఏముందని



ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి కేసీఆర్ విద్యాకు ప్రాధాన్యం ఇచ్చారని, ఉచిత విద్యా కల్పించేందుకు రీయింబర్స్మెంట్, బలహీన వర్గాలకు, మైనారిటీలకు ఎస్సీ, ఎస్టీలకు గురుకులాల ఏర్పాటు చేశారని, ఓవర్సీస్ స్కాలర్షిప్ అందించారన్నారు.



# హిందూ సమ్మేళనంలో భోగ శ్రావణి

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని కృష్ణానగర్ బస్తీలో నిర్వహించిన హిందూ సమ్మేళనం కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ భో శ్రావణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, సాంస్కృతిక విలువల పరిరక్షణకు ఇటువంటి సమ్మేళనాలు దోహదపడతాయని పేర్కొన్నారు. హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, బస్తి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్‌కు జ్యోతి శుభాకాంక్షలు

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఈవార్తలు): జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గడ్డం నారాయణ రెడ్డిని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ శుభాకాంక్షలు తెలిపారు. పొన్నాల గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి నారాయణ రెడ్డి కృషి చేస్తారని, మార్కెట్ కమిటీ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య తదితరులు పాల్గొన్నారు.



# మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలి

జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనంగా ఏర్పాటైన సందర్భంగా పొన్నాల గార్డెన్స్‌లో నిర్వహించిన చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ సయ్యద్ అఖిల్, సభ్యుల ప్రమాణ స్వీకార, సన్మాన సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రైతులు తమ పంటలకు దళారుల వల్ల మోసపోకుండా సరైన ధరలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మార్కెట్ కమిటీలు రైతులకు న్యాయం జరిగేలా పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు అనుకూల విధానాలను అమలు చేస్తూ మార్కెట్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించే దిశగా కృషి చేయాలని నూతన కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు గిరి నాగభూషణం, అడువాల జ్యోతి లక్ష్మణ్, గోలి శ్రీనివాస్, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, మాజీ ఏఎంసీ చైర్మన్లు కొలుగురి దామోదర్ రావు, నక్కల రాధ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
| --- | --- | --- |
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com



# జగిత్యాల విద్యార్థినికి రాష్ట్ర స్థాయి ర్యాంక్

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఈవార్తలు): జగిత్యాల పట్టణం కృష్ణానగర్‌కు చెందిన సాందరికారి లహరి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 1000 మార్కులకు గాను 995 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో ర్యాంకు, జిల్లాలో రెండో ర్యాంకు పొందింది. ఈ సందర్భంగా జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆమె నివాసానికి వెళ్లి లహరిని సన్మానించి అభినందించారు. విద్య ఒక్కటే జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శీలం ప్రియాంక ప్రవీణ్ కుమార్, రాగుల రాజు, గొడిసెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# లాభదాయక పంటలపై దృష్టి పెట్టాలి: సంజయ్

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఈవార్తలు): రైతులు లాభదాయక పంటల సాగుపై దృష్టి సారించాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సూచించారు. శనివారం బీర్పూర్ మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయంపై పూర్తి అవగాహనతోనే ప్రభుత్వం రైతులకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. సన్న వడ్ల సాగుకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. దొడ్డు రకం వడ్లకు బదులుగా డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. మక్కజొన్నకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో రైతులకు నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతు పక్షపాతి అని, రైతుబంధు నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# జగిత్యాలలో ఒకరిపై పోక్సో కేసు

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఈవార్తలు): జగిత్యాల పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీకి మనువాడ విష్ణువర్ధన్ అనే వ్యక్తిపై పోక్సో, కిడ్నాప్, అత్యాచారం సెక్షన్లపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు జగిత్యాల టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఓ ఫిర్యాదుదారుడు తన మైనర్ కూమార్తెను విష్ణువర్ధన్ అనే వ్యక్తి కిడ్నాప్ చేసి ఆమె అత్యాచారం చేసినట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడని, పట్టణ పోలీసులు విష్ణువర్ధన్ పై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

# కోఆప్షన్ సభ్యులకు ఎమ్మెల్యే సంజయ్ శుభాకాంక్షలు

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, తస్లీమ్ సుల్తానా ముజీబ్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను వారి నివాసంలో కలుసుకుని శాలువాతో సత్కరించి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికలో సహకరించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని వారు పేర్కొన్నారు. మైనారిటీల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సేవ చేయాలని సూచించారు. పట్టణ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ నాయకులు, మైనారిటీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మూడు రోజుల్లో ఆర్టీసీ సమ్మెను ముగించాం: అడ్లూరి

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఈవార్తలు): గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే చర్చలకు కూడా పిలవకుండా డిస్మిస్ చేస్తామని హెచ్చరించారని, ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో మూడు రోజుల్లోనే సమ్మెకు ముగింపు పలికామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శనివారం జగిత్యాలలో జరిగిన మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించామని చెప్పారు. కార్మికులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని, రైతులకు ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మక్కజొన్న రైతులకు క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర అందిస్తున్నామని చెప్పారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి జగిత్యాల జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు. కాగా, ఆర్టీసీ జేఏసీ నాయకులు మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను సన్మానించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని తెలిపారు.




# మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

జగిత్యాల, ఏప్రిల్ 25 (ఈవార్తలు): ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలో శుక్రవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. మోతేవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి తహసీల్ చౌరస్తా వరకు సాగిన ఈ ర్యాలీని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ఎన్. శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. అర్చన జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా మలేరియా ప్రోగ్రామ్ అధికారి డా. పి. అర్చన ర్యాలీకి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా డా. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవం జరుపుకుంటామని, ఈ ఏడాది "మలేరియా లేని ప్రపంచం కోసం పునఃప్రతిజ్ఞ చేద్దాం" అనే నినాదంతో కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మలేరియా ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల వ్యాపిస్తుందని, దోమల నివారణే ప్రధాన పరిష్కారమని చెప్పారు. డా. అర్చన మాట్లాడుతూ జ్వరం వచ్చిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు. మలేరియా నిర్ధారణ అయితే 14 రోజుల పూర్తి కోర్సు మందులు ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, వారానికి ఒకసారి డ్రై డే పాటించడం అవసరమన్నారు. ర్యాలీలో "దోమపై దండయాత్ర -- మలేరియాపై విజయం", "నీటి నిల్వలను తొలగిద్దాం -- మలేరియాను తరిమికొడదాం" వంటి నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. జిల్లాలో మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయని, 2030 నాటికి మలేరియా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, హెల్త్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తాం

**2 రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు.. కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటనకు ఓకే.. మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఈవార్తలు): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా పలు డిమాండ్లకు తమ ప్రభుత్వం అంగీకరించిందని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు , అధికార ప్రతినిధులతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండు రోజుల సమ్మెలోనే పలుమార్లు కార్మికులతో చర్చలు జరిపినట్లు తెలిపారు. వారి చిరకాల స్వప్నమైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలు, 11 శాతం పీఆర్సీ ప్రకటన పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ప్రభుత్వం డిమాండ్లకు అంగీకరించడంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై మంత్రుల బృందం సుమారు 15 గంటలు చర్చించి వారి సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింప జేశారని అన్నారు. ఆర్టీసీ కార్మికుల అంశాలపై ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కేడర్ సంబరాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించిందని అన్నారు. ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ, ఉద్యోగులకు 11 శాతం పీఆర్సీ ప్రకటనతో పాటు మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో కార్మికులు 55 రోజుల పాటు సమ్మె చేస్తే గత ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఆ రోజు సమ్మె సమయంలో 30 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వానికి శత్రుత్వం ఉండదని, వారు కూడా కుటుంబ సభ్యులే అన్నారు. ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ వ్యవహరించిన తీరు సరికాదని అన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మనం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ నియామకాలు, కారుణ్య నియామకాలు, సర్వీసు నుంచి తొలగించిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణం చేస్తున్నారని తెలిపారు.



# ఇరాన్‌తో చర్చలు బంద్

**పాక్‌కు వెళ్లకండి.. ప్రతినిధులకు ట్రంప్ ఆదేశాలు**



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌తో చర్చల నిమిత్తం తమ ప్రతినిధుల బృందం పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు వెళ్లాల్సి ఉండగా, ఆ పర్యటనను రద్దు చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. చర్చల కోసం అంత దూరం ప్రయాణించడం సమయం వృథా అని, వాళ్లు మాట్లాడాలనుకుంటే ఫోన్ చేస్తే సరిపోతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. "ఇరాన్‌తో సమావేశం కోసం ఇస్లామాబాద్ వెళుతున్న నా ప్రతినిధుల పర్యటనను ఇప్పుడే రద్దు చేశాను. ప్రయాణంతో సమయం వృథా అవుతుంది. ఫలితం లేని చర్చల కోసం అంత దూరం వెళ్లడం అనవసరం. పైగా, ఇరాన్ నాయకత్వంలో తీవ్ర గందరగోళం, అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయి. ఎవరి చేతిలో అధికారం ఉందో వారికే తెలియదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే, అమెరికా ప్రతినిధులతో నేరుగా సమావేశమయ్యే ప్రణాళిక ఏదీ లేదని ఇరాన్ ముందుగానే స్పష్టం చేసింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతోనే తమ అభిప్రాయాలు తెలియజేస్తామని చెప్పింది. ఈ ప్రకటన తర్వాత ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చి నేతృత్వంలోని బృందం పాకిస్థాన్ నుంచి బయలుదేరి వెళ్లిపోయింది. ఈ పరిణామాల తర్వాతే ట్రంప్ తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. "అన్ని అస్త్రాలు మా చేతిలోనే ఉన్నాయి, వాళ్ల చేతిలో ఏమీ లేదు. ఒకవేళ వాళ్లు మాట్లాడాలనుకుంటే, చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే!" అని ట్రంప్ తన పోస్టులో ఘాటుగా పేర్కొన్నారు. ఈ చర్చల కోసం అమెరికా తరఫున ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ వెళ్లాల్సి ఉంది. తాజా పరిణామంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరుగుతున్న మధ్యవర్తిత్వ ప్రయత్నాలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.

# గేమర్ల కోసం జియో 459 ప్లాన్

ముంబై: ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో, గేమర్లు మరియు యువతను లక్ష్యంగా చేసుకుని సరికొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. 'జియో యూత్ అండ్ గేమింగ్ ప్లాన్' పేరుతో వచ్చిన ఈ ప్లాన్ ధరను రూ.459గా నిర్ణయించారు. డేటాతో పాటు గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రయోజనాలను కూడా ఈ ప్లాన్‌లో అందిస్తున్నారు. ఈ ప్లాన్ వివరాల్లోకి వెళితే, రూ.459 రీచార్జ్‌తో 28 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. ఈ సమయంలో వినియోగదారులకు మొత్తం 61 జీబీ హైస్పీడ్ డేటా అందుబాటులో ఉంటుంది. ఇందులో రోజుకు 2 జీబీ చొప్పున 56 జీబీ డేటాతో పాటు, అదనంగా మరో 5 జీబీ డేటా కూడా అందిస్తారు. అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు కూడా ఈ ప్లాన్‌లో భాగంగా ఉన్నాయి. ఈ ప్లాన్ ద్వారా జియో గేమ్స్, క్లౌడ్ గేమింగ్ యాక్సెస్‌ను మై జియో యాప్‌లో పొందవచ్చు. వీటితో పాటు మూడు నెలల పాటు జియో హాట్‌స్టార్ మొబైల్ సబ్‌స్క్రిప్షన్, స్నాప్‌చాట్+ సబ్‌స్క్రిప్షన్ ఉచితంగా లభిస్తాయి. ముఖ్యంగా, సుమారు రూ.35,100 విలువైన గూగుల్ జెమినీ ప్రో యాక్సెస్‌ను 18 నెలల పాటు ఉచితంగా అందిస్తుండటం ఈ ప్లాన్‌లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. గేమింగ్, సోషల్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రయోజనాలను ఒకేచోట అందించడం ద్వారా యువత సెగ్మెంట్‌లో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని జియో భావిస్తోంది. ఆసక్తి ఉన్న వినియోగదారులు మై జియో యాప్ లేదా జియో అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఈ ప్లాన్‌ను రీచార్జ్ చేసుకోవచ్చు.

# కవితవి పిట్టల దొరసాని మాటలు

**ఎంపీ ధర్మపురి అర్వింద్**



నిజామాబాద్, ఏప్రిల్ 25 (ఈవార్తలు): కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ పార్టీని ఈరోజు ప్రారంభించిన సంగతి తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరుతో ఆమె పార్టీని ప్రకటించారు. కవిత పార్టీపై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీజేపీపై ఆమె చేసిన విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. 'పిట్టల దొరసాని' అంటూ కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గతంలో పిట్టల దొరను చూశారని, ఇప్పుడు కొత్త పార్టీ పేరుతో వస్తున్న 'పిట్టల దొరసాని'ని ప్రజలు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ గడ్డపైనే కవితకు బీజేపీ రాజకీయ సమాధి కట్టిందని అర్వింద్ గుర్తు చేశారు. ఇప్పుడు కొత్త పార్టీ పెట్టినా ఆమెకు పుట్టగతులు ఉండవని వ్యాఖ్యానించారు. బీజేపీ మద్దతు లేకుండానే తెలంగాణ వచ్చిందా? అని కవితను ప్రశ్నించారు. విభజన ప్రక్రియను బీఆర్ఎస్ నేతలు సరిగ్గా నిర్వహించక పోవడం వల్లే అనేక మంది బలిదానాలు జరిగాయని ఆరోపించారు. ఇదే విషయాన్ని ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంటులో కూడా ప్రస్తావించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించి బీజేపీని గెలిపించారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ అదృష్టం బాగుందని, అందుకే ఆయన మంత్రి, ఎమ్మెల్సీ కాగలిగారని అర్వింద్ పేర్కొన్నారు. గవర్నర్ కోటాలో ఆయనకు లబ్ధి చేకూరిందని అన్నారు.

# డిజిటల్ వ్యాలెట్లపై ఆర్‌బీఐ నయా రూల్స్

న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్ చెల్లింపులను మరింత సురక్షితంగా, పారదర్శకంగా మార్చేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక చర్యలు చేపట్టింది. ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్స్ (పీపీఐ) అయిన డిజిటల్ వ్యాలెట్లు, ప్రీపెయిడ్ కార్డులకు సంబంధించి కొత్త ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది. వినియోగదారుల రక్షణ, నిర్వహణలో స్పష్టత పెంచడమే ఈ ప్రతిపాదనల ముఖ్య ఉద్దేశం. ఈ ముసాయిదా ప్రకారం, నాన్-బ్యాంక్ సంస్థలు పీపీఐ సేవలు అందించాలంటే కనీసం రూ. 5 కోట్ల నికర విలువ కలిగి ఉండాలి. కార్యకలాపాలు ప్రారంభించిన మూడేళ్లలోగా ఈ విలువను రూ. 15 కోట్లకు పెంచుకోవాలి. అలాగే, వినియోగదారుల నుంచి సేకరించిన నిధులను వాణిజ్య బ్యాంకులోని ప్రత్యేక ఎస్క్రో ఖాతాలో జమ చేయడాన్ని తప్పనిసరి చేశారు. డెబిట్ కార్డులు జారీ చేసే బ్యాంకులు కూడా ఆర్‌బీఐకి సమాచారం ఇచ్చి పీపీఐ సేవలు అందించవచ్చని ప్రతిపాదించారు. లావాదేవీల పరిమితులపై కూడా డ్రాఫ్ట్‌లో స్పష్టత ఇచ్చారు. సాధారణ పీపీఐలలో గరిష్ఠంగా రూ. 2 లక్షల వరకు బ్యాలెన్స్ ఉంచుకోవచ్చు. నెలకు రూ. 10,000 వరకు నగదు లోడ్ చేసుకోవడానికి అనుమతిస్తారు. చిన్న మొత్తాల పీపీఐల గరిష్ఠ పరిమితిని రూ. 10,000గా, ట్రాన్సిట్ కార్డుల పరిమితిని రూ. 3,000గా నిర్ణయించారు. వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా, అన్ని ఛార్జీలు, నిబంధనలు, వ్యాలిడిటీ వివరాలను ఇంగ్లీష్, హిందీతో పాటు స్థానిక భాషలో స్పష్టంగా తెలియజేయాలని ఆర్‌బీఐ ఆదేశించింది. విఫలమైన, రద్దయిన లావాదేవీలకు సంబంధించిన డబ్బును తక్షణమే వినియోగదారుడి వ్యాలెట్‌కు రిఫండ్ చేయాలని పేర్కొంది. ఈ ముసాయిదాపై మే 22లోగా ప్రజలు, భాగస్వామ్య పక్షాలు తమ అభిప్రాయాలను తెలపాలని ఆర్‌బీఐ కోరింది.

# పోలీసుల ఎదుట 47 మంది నక్సల్స్ లొంగుబాటు

**డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఆయుధాలు అప్పగింత**

లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ వాసులే

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఈవార్తలు): తెలంగాణలో మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఏకంగా 47 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో ఈ లొంగుబాటు జరిగింది. ఈ సందర్భంగా వారు 34 అత్యాధునిక ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. లొంగిపోయిన వారిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారని అధికారులు తెలిపారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో 'ఆపరేషన్ కగార్' పేరుతో గ్రేహౌండ్స్, సీఆర్‌పీఎఫ్ బలగాలు చేపట్టిన ముమ్మర కూంబింగ్ ఆపరేషన్ల వల్లే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసుల నిఘా పెరగడం, సాయుధ పోరాటంపై విరక్తి చెందడంతో జనజీవన స్రవంతిలో కలిసేందుకు వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ సామూహిక లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు దాదాపుగా ముగిసినట్లేనని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమానికి ఇది గట్టి దెబ్బగా పరిగణిస్తున్నారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ... ఇంత పెద్ద సంఖ్యలో మావోలు లొంగిపోయిన చివరి బ్యాచ్ బహుశా ఇదేనని, ఇకపై ఈ స్థాయిలో లొంగిపోవడానికి మావోయిస్టులు కూడా ఎక్కువ మంది లేరని అన్నారు."హింస ద్వారా ఏ సమస్య పరిష్కారం కాదు. ఆయుధాలు విడిచిపెట్టి జనజీవనంలోకి రావాలి" అని ఇంకా అజ్ఞాతంలో ఉన్న కొద్దిమంది మావోయిస్టులకు ఆయన పిలుపునిచ్చారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే హెల్త్ కార్డుల పంపిణీ ఉంటుందని తెలిపారు.






# భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఈవార్తలు): రాష్ట్రంలో మరోసారి భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. తెలంగాణ భవన్ ప్రత్యేక అధికారిగా సంజయ్ కుమార్ ఎంపికయ్యారు. సీసీఎల్ఏ కార్యదర్శిగా అపూర్వ్ చౌహాన్, ములుగు కలెక్టర్ జి.హెచ్ సహదేవ్ రావు, నాగర్ కర్నూల్ హెచ్ కే పాటిల్, ఏటూరు నాగారం ఐటీడీఏ పీవోగా లెనిన్ వత్సల్, కుమరం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్‌గా యువరాజ్, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బి.ఎం. సంతోష నియమితులయ్యారు. జీహెచ్ఎంసీ గోల్కొండ జోనల్ కమిషనర్‌గా జి.ఉదయ్ కుమార్ బదిలీ అయ్యారు. ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శిగా అనుదీప్ దురిశెట్టి బాధ్యతలు తీసుకోనున్నారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా వికాస్ మహతో, రాజేంద్ర నగర్ జోనల్ కమిషనర్‌గా ఎస్. శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి కలెక్టర్‌గా ప్రతీక్ జైన్, నిర్మల్ కలెక్టర్‌గా భవేశ్ మిశ్రా, ఖమ్మం కలెక్టర్‌గా దివాకర, నారాయణ్‌పేట కలెక్టర్‌గా సిహెచ్ ప్రియాంక, ఉట్నూరు ఐటీడీఏ పీఓగా మకరందు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కమిషనర్‌గా దాన కిశోర్‌ను నియమించారు. నాగర్ కర్నూల్ కలెక్టర్‌గా హెచ్‌కే పాటిల్ బదిలీ అయ్యారు. హైదరాబాద్ కలెక్టర్ హరి చందన కార్మిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా వెళ్లారు. హరిచందన స్థానంలో ప్రియాంక హైదరాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆర్అండ్‌బీ ప్రావీణ్య, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా కృష్ణ ఆదిత్య, ఐఅండ్ పీఆర్ ప్రత్యేక కార్యదర్శిగా జీ ముకుంద్ రెడ్డి, ఇంటర్ బోర్డు డైరెక్టర్‌గా అభిలాష్ అభినవ్ , ఆరోగ్య శ్రీ సీఈఓగా అభివన్ హనుమంతు కొడింబా నియమితులయ్యారు.

# బీజేపీదే అధికారం: రాంచందర్ రావు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూతురు కవిత తన కొత్త పార్టీని ప్రకటించడంపై తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఉన్నా, కొత్త పార్టీలు పుట్టుకువచ్చినా బీజేపీకి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని అన్నారు. తెలంగాణలో బీజేపీకి మంచి వాతావరణం ఉందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పన్నెండేళ్లుగా అవినీతిరహిత పాలనను అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చాలామంది పార్టీలు పెడుతున్నారని, ఇప్పుడే ఒకరు పార్టీని ప్రకటించారని తెలిపారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని ఎద్దేవా చేశారు. గతంలో టీఆర్ఎస్, ఇప్పుడు బీఆర్ఎస్ అయిందని, ఇప్పుడు వారి బిడ్డ పెట్టే పార్టీ కూడా టీఆర్ఎస్ అని చురక అంటించారు. దేశంలో అవినీతిరహిత పాలన ఇస్తోంది బీజేపీ మాత్రమే అన్నారు.

# ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్.. గవర్నర్ సైన్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ఈవార్తలు): గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి రాష్ట్ర కేబినెట్ ప్రతిపాదించిన అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్ అయింది. అజారుద్దీన్, కోదండరాం అభ్యర్థిత్వాలను ఆమోదిస్తూ ఫైల్‌పై గవర్నర్ శివ్ ప్రతాప్ సంతకం చేశారు. దీనిపై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై గత మూడేళ్లుగా ప్రతిష్టంభన నెలకొన్న విషయం తెలిసిందే. గవర్నర్ కోటా ద్వారా ఎమ్మెల్సీలుగా నియామకమైన మంత్రి అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరాంలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవలో వారి అనుభవం, రాష్ట్ర అభివృద్ధికి మరింత దోహదపడతాయని విశ్వసించారు. శాసన మండలిలో వారి సేవలు ప్రజల ఆశయాలకు అనుగుణంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కొంత కాలంగా ఈ ఇద్దరి ఎమ్మెల్సీల నియామకం పెండింగ్‌లో ఉండడంతో తాజాగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా నియామకంపై ఆమోదం తెలపడం వారికి ధన్యవాదాలు తెలిపారు.

# కేజ్రీవాల్ వల్లే బయటకు: చద్దా

న్యూఢిల్లీ: తనతో సహా ఏడుగురు ఎంపీలు భయంతో ఆమ్ ఆద్మీ పార్టీని వీడలేదని, కేజ్రీవాల్ విధానాల కారణంగా బలవంతంగా బయటకు రావాల్సి వచ్చిందని బీజేపీలో చేరిన రాఘవ్ చద్దా అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రస్తుతం సరైన మార్గంలో వెళ్లడం లేదని విమర్శించారు. పార్టీ కోసం నిత్యం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. మరికొందరు నాయకులు కూడా పార్టీని వీడే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీలో ఉండటానికి చాలామందికి ఇష్టం లేదని అన్నారు. నిరాశ, నిస్పృహ, అసహ్యం వల్లే బయటకు వచ్చామని అన్నారు.

### 24 గంటల్లో తగ్గిన 10 లక్షల మంది ఫాలోవర్లు

ఆమ్ ఆద్మీ పార్టీని వీడి బీజేపీలో చేరతానని ప్రకటించడం ద్వారా రాఘవ్ చద్దా జాతీయ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారు. అయితే ఈ ప్రకటన తర్వాత ఆయనకు సామాజిక మాధ్యమాల్లో ఫాలోవర్లు తగ్గిపోయారు. పార్టీ మారుతున్నట్లు ఆయన ప్రకటించిన 24 గంటల్లో సోషల్ మీడియాలో ఆయన ఫాలోయింగ్ తగ్గిపోయింది. రాఘవ్ చద్దాకు నిన్నటి వరకు ఇన్‌స్టాగ్రామ్‌లో 14.6 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. కానీ ఈరోజు మధ్యాహ్నానికి ఆ సంఖ్య 13.5 మిలియన్లకు తగ్గింది. ఇటీవల లోక్ సభలో ఆయన సంధించిన ప్రశ్నలతో ఫాలోవర్ల సంఖ్య పెరిగింది. కానీ గత ఇరవై నాలుగు గంటల్లో మాత్రం ఒక్కసారిగా తగ్గిపోయింది. రాఘవ్ చద్దాకు 24 గంటల్లో 10 లక్షల మంది ఫాలోవర్లు తగ్గిపోవడంపై ఎన్సీపీ(శరద్ పవార్) అధికార ప్రతినిధి అనీశ్ గవాండే స్పందించారు. ఇంటర్నెట్ మిమ్మల్ని రాత్రికి రాత్రే హీరోగా మార్చగలదు, అలాగే రాత్రికి రాత్రే మిమ్మల్ని సున్నాకు కూడా పడేయగలదని ట్వీట్ చేశారు.

# ఏపీ హైకోర్టు నూతన సీజేగా జస్టిస్ లీసా గిల్ ప్రమాణం

అమరావతి, ఏప్రిల్ 25 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ లీసా గిల్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నియామకంతో ఏపీ హైకోర్టు చరిత్రలో ఆమె తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా నిలిచారు. అమరావతిలోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమెతో ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకారానికి ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు, జస్టిస్ లీసా గిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైకోర్టుకు తొలి మహిళా సీజేగా నియమితులైనందుకు ఆమెను అభినందించారు. జస్టిస్ లీసా గిల్ స్వస్థలం చండీగఢ్. పంజాబ్ యూనివర్సిటీలో న్యాయశాస్త్రంలో పట్టా పొందిన ఆమె, 1990లో న్యాయవాదిగా తన వృత్తిని ప్రారంభించారు. పంజాబ్-హరియాణా హైకోర్టులో సివిల్, క్రిమినల్, రాజ్యాంగపరమైన కేసుల్లో విస్తృతమైన అనుభవం గడించారు. 2014 మార్చిలో పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులై, ఇప్పుడు ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ లీసా గిల్ నాయకత్వంలో ఏపీ న్యాయవ్యవస్థకు కొత్త దిశానిర్దేశం లభిస్తుందని న్యాయవర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

వయ్యారి చిత్రం



## లెనిన్ రిలీజ్‌కు 'పెద్ది' కష్టాలు

టాలీవుడ్‌లో అరంగేట్రానికి ముందే భారీ హైప్ తెచ్చుకున్న హీరోల్లో అఖిల్ అక్కినేని ఒకరు. మెగాస్టార్ తనయుడు రామ్ చరణ్ నటించిన 'చిరుత'ను మించిన స్థాయిలో అఖిల్ తొలి సినిమా 'అఖిల్'కు క్రేజ్ లభించింది. అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటాయి. కానీ ఆ సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో అఖిల్ కెరీర్‌కు మొదటి నుంచే పెద్ద షాక్ తగిలింది. ఆ తర్వాత హీరోగా నిలదొక్కుకోవడానికి అఖిల్ ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ, పెద్ద విజయాలు దక్కలేదు. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ చిత్రంతో మోస్తరు హిట్ కొట్టినప్పటికీ , ఏజెంట్ డిజాస్టర్‌తో మళ్లీ వెనక్కి




వెళ్లిపోయాడు. ప్రస్తుతం తన ఆశలన్నీ 'లెనిన్' సినిమా మీదే పెట్టుకున్నాడు. అయితే ఈ సినిమాకు రిలీజ్ డేట్ వ్యవహారం పెద్ద సమస్యగా మారింది. మొదట ఏప్రిల్ 30న పెద్దితో క్లాష్ కాకుండా మే 1కి 'లెనిన్'ను వాయిదా వేసినట్లు ప్రకటించారు. కానీ కొద్దిరోజుల్లోనే అసలు విషయం బయటపడింది. 'పెద్ది' వాయిదా పడినా కూడా 'లెనిన్' మే 1న రిలీజ్ అయ్యే పరిస్థితి లేదని తేలిపోయింది. దీంతో సినిమాపై అనవసర నెగెటివిటీ పెరిగింది. ఆ తర్వాత 'లెనిన్' కోసం జూన్ 25ని కొత్త రిలీజ్ డేట్‌గా ఫిక్స్ చేశారు. కానీ ఇప్పుడు అదే తేదీకి 'పెద్ది' రావచ్చనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. మొదట జూన్ 4న రిలీజ్ అవుతుందని భావించిన టాక్సిక్ వాయిదా పడుతుందేమోనని 'పెద్ది' టీం ఆలోచించింది. కానీ 'టాక్సిక్' నిర్ణయించిన తేదీకే వస్తుందని సమాచారం రావడంతో, మూడు వారాల గ్యాప్ తీసుకుని జూన్ 25నే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు పరిస్థితి చూస్తే 'లెనిన్' టీంకు మరోసారి డేట్ మార్చుకోవడం తప్పదన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే 'పెద్ది' లాంటి భారీ ప్రాజెక్ట్‌తో పోటీ పడే స్థితిలో 'లెనిన్' లేదని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇండస్ట్రీ మొత్తం 'పెద్ది' విడుదల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో, ఆ సినిమాకు మార్గం సుగమం చేయడం తప్ప వేరే ఆప్షన్ లేకపోవచ్చు. మొత్తానికి, రిలీజ్ డేట్ గందరగోళం 'లెనిన్'కు పెద్ద తలనొప్పిగా మారింది. ఇప్పటికే డిలేలు, నెగెటివ్ టాక్ మధ్య ఇరుక్కున్న ఈ సినిమా... మరోసారి వాయిదా పడితే ప్రేక్షకుల్లో ఆసక్తి తగ్గే ప్రమాదం ఉంది. ఈసారి డేట్ మార్చేటప్పుడు టీం ఏ కారణం చెబుతుందన్నది ఆసక్తికరంగా మారింది.



## అక్షయ్ కూతురికి వేధింపులు.. ఒకరి అరెస్టు

బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ కుటుంబంలో చోటు చేసుకున్న తాజా సైబర్ సంఘటన దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఆయన కుమార్తె నిటార కుమార్ ఆన్‌లైన్ గేమింగ్ సమయంలో ఎదుర్కొన్న సెక్స్టార్షన్ ప్రయత్నం కేవలం ఒక వ్యక్తిగత అనుభవంగా కాకుండా, డిజిటల్ ప్రపంచంలో పిల్లల భద్రతపై పెద్ద హెచ్చరికగా మారింది. స్టార్ కుటుంబానికే ఇలాంటి ప్రమాదం ఎదురైతే, సాధారణ కుటుంబాల పరిస్థితి ఏంటనే ప్రశ్న ఇప్పుడు మరింత బలంగా వినిపిస్తోంది. అయితే ఈ కేసులో మహారాష్ట్ర సైబర్ డిపార్ట్‌మెంట్ వేగంగా స్పందించి నిందితుడిని అరెస్ట్ చేసింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే దర్యాప్తు చేపట్టి, డిజిటల్ ట్రేసింగ్ ద్వారా నిందితుడిని గుర్తించడం సైబర్ క్రైమ్ నియంత్రణలో కీలక ముందడుగు వేసింది. బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే సైబర్ టీమ్ చర్యలు తీసుకోవడానికి ఎప్పుడూ ముందుంటుందనే విషయాన్ని ఈ సంఘటన స్పష్టం చేస్తుంది. చాలా సందర్భాల్లో భయంతో ఫిర్యాదు చేయకుండా ఉండే కుటుంబాలకు ఇది ఒక నమ్మకం కలిగించే ఉదాహరణగా నిలుస్తోంది. అయితే ఈ ఘటన ఒక వ్యక్తిగత కేసును మించిపోయి, దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాల భయానక వాస్తవాన్ని కూడా బయటపెడుతోంది. ఆన్‌లైన్ గేమ్స్, సోషల్ మీడియా, చాట్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా చిన్నారులను లక్ష్యంగా చేసుకుని జరిగే సెక్స్టార్షన్, బ్లాక్‌మెయిల్ కేసులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. స్నేహపూర్వక సంభాషణలతో మొదలై, నెమ్మదిగా వ్యక్తిగత సమాచారాన్ని పొందడం, చివరకు బెదిరింపులకు దారి తీసే విధానం ఇప్పుడు సాధారణ ట్రెండ్‌గా మారింది. ఈ నేపథ్యంలో చిన్నారులపై మానసిక ఒత్తిడి, డిప్రెషన్, అత్యంత దురదృష్టకరంగా ఆత్మహత్యల వరకు వెళ్లే ఘటనలు నమోదవుతున్నాయి.

## ఎమోషన్స్సే నా సినిమాలకు కీలకం: రాజమౌళి



తన సినిమాలతో గ్లోబల్ దర్శకునిగా మారిన దర్శక దిగ్గజం ఎస్ ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ చిత్రమే "వారణాసి". సూపర్ స్టార్ మహేష్ బాబు కలయికలో ఒక డ్రీం కాంబినేషన్ గా వస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ పాన్ వరల్డ్ లెవెల్లో ప్రమోషన్స్ ఇపుడు జరుపుకుంటుంది. అయితే తాజాగా వారణాసి విషయంలో రాజమౌళి మెక్సికో ప్రజలకి ఇచ్చిన సందేశంలో చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి. తన సినిమాల్లో కదిలించే ఎమోషన్స్, మనుషులకి అందించే అనుభూతిలే కీలకం అని అవి సరిగ్గా ఉంటే ఏ దేశం ప్రజల్లోకి అయినా సినిమా వెళ్లి తీరుతుంది అని తెలిపారు. ఇపుడు తాను చేస్తున్న వారణాసి సినిమాకి కూడా అవే ఫౌండేషన్ అని రాజమౌళి రివీల్ చేశారు. బలమైన ఎమోషన్స్ తో జక్కన్న స్టోరీ టెల్లింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇప్పుడు ఇదే స్ట్రాటజీలోనే వారణాసి కూడా సిద్ధం చేస్తుండగా ఇది గ్లోబల్ ఆడియెన్స్ లో ఏ రేంజ్ లో రీచ్ అవుతుందో చూడాల్సిందే.

## సతీ లీలావతి మే 8న

మెగా ఇంటి కోడలు లావణ్య కొణిదెల త్రిపాఠి, దేవ్ మోహన్ ప్రధాన పాత్రధారులుగా దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై తాతినేని సత్య దర్శకత్వంలో రూపొందుతోన్న లేటెస్ట్ సినిమానే 'సతీ లీలావతి'. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మే 8న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ కి తీసుకొస్తున్నట్టు మేకర్స్ లేటెస్ట్ అప్డేట్ అందించారు. రెండు వేర్వేరు కుటుంబాలు, నేపథ్యాల నుంచి వచ్చిన వ్యక్తులు కలిసి ప్రయాణించాలంటే వారి మధ్య ఎమోషన్స్ ఇంకెంత బలంగా ఉండాలో అనే సునిశితమైన అంశాన్ని సతీ లీలావతి చిత్రంలో ఆవిష్కరించారు దర్శకుడు తాతినేని సత్య. భార్య, భర్త మధ్య ఉండే అనుబంధాన్ని ఎమోషనల్‌గానే కాకుండా ఎంటర్‌టైనింగ్‌గానూ చెప్పే ప్రయత్నమే సతీలీలావతి చిత్రం. ఫీల్ గుడ్ మూవీగా అందరినీ ఆకట్టుకునేలా, అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించేలా సినిమాను రూపొందించామని మేకర్స్ తెలియజేశారు. ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి రెండు సాంగ్స్, టీజర్‌కు ప్రేక్షకుల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే ట్రైలర్ రిలీజ్ కానుంది. ఈ మూవీకి సంగీత దర్శకుడిగా మిక్కీ జే మేయర్, కెమెరామెన్‌గా బినేంద్ర మీనన్, ఎడిటర్‌గా సతీష్ సూర్య వర్క్ అందించారు.





## శ్రీ విష్ణు చేతిలో 4 సినిమాలు

తెలుగు సినిమా పరిశ్రమలో అద్భుతమైన జోష్‌తో కెరీర్‌ను ముందుకు సాగిస్తున్న యువ నటుల్లో శ్రీ విష్ణు ఒకరు. ఈయన ఈ సంవత్సరం కేవలం వారం గ్యాప్‌లోనే విష్ణు విన్యాసం, మృత్యుంజయ్ అనే రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ రెండు సినిమాలు కూడా మంచి ప్రేక్షకాదరణ పొందాయి. ఇక ప్రస్తుతం ఈయన చేతిలో ఏకంగా నాలుగు చిత్రాలు ఉన్నాయి. ప్రస్తుతం సితార ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌లో సన్నీ సంజయ్ అనే చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ ఆల్మోస్ట్ సగానికి పైగా పూర్తి అయినట్లు తెలుస్తోంది. ఈ సినిమాతో పాటు ప్రస్తుతం రామ్ అబ్బరాజు దర్శకత్వంలో మరో సినిమాలో కూడా నటిస్తున్నాడు. ఆ సినిమా షూటింగ్ కూడా శరవేగంగా జరుగుతోంది. ఈ రెండు సినిమాలను ఈ ఏడాది రిలీజ్ చేసే ప్లాన్‌లో శ్రీ విష్ణు ఉన్నట్లు తెలుస్తోంది. శ్రీ విష్ణు ప్రస్తుతం భాను భోగవరపు, పవన్ బసంశెట్టిలతో కూడా చర్చలు జరుపుతున్నట్లు, అన్ని సానుకూలంగా జరిగితే ఈ ఇద్దరితో కూడా ఈ ఏడాది సినిమాలు స్టార్ట్ చేసే ఆలోచనలో ఈ యువ హీరో ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా వరుస సినిమా షూటింగ్స్‌లో పాల్గొనడం మాత్రమే కాకుండా అనేక సినిమాలను ఒకే చేస్తూ శ్రీ విష్ణు ప్రస్తుతం జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నాడు.



## ప్రియాంకకు గ్లోబల్ వాన్‌గార్డ్ హానర్ అవార్డు

భారతీయ సినీ పరిశ్రమ నుంచి హాలీవుడ్ వరకు తన ప్రతిభతో సరిహద్దులను చెరిపేసిన నటి ప్రియాంక చోప్రా ఖాతాలో మరో ప్రతిష్ఠాత్మక గౌరవం చేరింది. ఆమెకు 'గ్లోబల్ వాన్‌గార్డ్ హానర్' అవార్డు లభించనుంది. ఈ అవార్డును అమెరికాలో నిర్వహించనున్న 'గోల్డ్ హౌస్ గోల్డ్ గాలా-2026' వేడుకల్లో ఆమె అందుకోనున్నారు. మే 9న లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న ఈ కార్యక్రమం ఇప్పటికే విశేష దృష్టిని ఆకర్షిస్తోంది. ఆసియా-పాసిఫిక్ ప్రాంతానికి చెందిన ప్రతిభావంతుల విజయాలను గుర్తించి సత్కరించే ఈ వేదికపై ప్రియాంకకు ఈ గౌరవం దక్కడం విశేషం. కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, వివిధ రంగాల్లో ప్రభావం చూపిన నాయకులను కూడా ఈ వేడుకలో సత్కరించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రియాంక ఎంపిక కావడం భారతీయులకు గర్వకారణంగా మారింది. ఇప్పటికే 25 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న ప్రియాంకా చోప్రా, మిస్ వరల్డ్ విజేతగా తన ప్రయాణాన్ని అంతర్జాతీయ స్థాయిలో విస్తరించింది. బాలీవుడ్‌లో అగ్రనటిగా ఎదిగిన ఆమె, తర్వాత హాలీవుడ్‌లోనూ గుర్తింపు పొందింది. భిన్న సంస్కృతుల మధ్య వారధిగా నిలుస్తూ భారతీయ సినీ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసింది. నటిగా మాత్రమే కాకుండా, సామాజిక అంశాల్లోనూ చురుకుగా పాల్గొంటూ సమాజానికి తన వంతు సేవ అందించడం కూడా ఆమెకు ఈ అవార్డు రావడానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపిన వ్యక్తిగా ఆమెను గౌరవించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ ఏడాది 'గోల్డ్ గాలా' వేడుక 'ఎ న్యూ గోల్డ్ వరల్డ్' అనే అంశంతో జరుగుతోంది. ఈ కార్యక్రమంలో ప్రియాంకతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు కూడా పాల్గొననున్నారు. వ్యాపారం, సాంకేతికం, ఫ్యాషన్, క్రీడలు వంటి విభిన్న రంగాల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 650 మంది ప్రముఖులు ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఇక ప్రియాంకా చోప్రా తన సినీ ప్రయాణాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధమవుతోంది. దర్శకుడు రాజమౌళి తెరకెక్కించనున్న 'వారణాసి' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషిస్తుంది.

వరుసగా ఆరో విజయం

# పంజాబ్ జైత్రయాత్ర

## 265 భారీ లక్ష్యం ఛేదన.. ఢిల్లీ కొంపముంచిన ఫీల్డింగ్

**ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఓటమెరుగని జట్టుగా ఆరో విజయాన్ని కైవసం చేసుకుంది. శనివారం న్యూఢిల్లీ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. 265 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి ఈ ఘనత సాధించిన తొలి ఐపీఎల్ జట్టుగా చరిత్ర సృష్టించింది.**



టీ20 క్రికెట్ చరిత్రలోనే ఏ జట్టు కూడా ఇంత పెద్ద లక్ష్యాన్ని ఛేదించలేదు. చెత్త ఫీల్డింగ్ ఢిల్లీ క్యాపిటల్స్ కొంపముంచగా.. పంజాబ్ కింగ్స్‌కు కలిసొచ్చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లకు 264 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(67 బంతుల్లో 16 ఫోర్లు, 9 సిక్స్‌లతో 152 నాటౌట్) అజేయ శతకంతో రాణించగా.. నితీష్ రాణా(44 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్‌లతో 91) తృటిలో శతకాన్ని చేజార్చుకున్నాడు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, జేవియర్ బార్ట్‌లెట్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం పంజాబ్ కింగ్స్ 18.5 ఓవర్లలో 265 పరుగులు చేసి గెలుపొందింది. ప్రభ్‌సిమ్రాన్ సింగ్(26 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్స్‌లతో 76), ప్రియాన్ష్ ఆర్య(17 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 43), శ్రేయస్ అయ్యర్(36 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లతో 71 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగారు. ఢిల్లీ బౌలర్లలో కుల్దీప్ యాదవ్(2/46) రెండు వికెట్లు తీయగా.. అక్షర్ పటేల్, విప్రజ్ నిగమ్ తలో వికెట్ తీసారు. 28, 35 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద శ్రేయస్ అయ్యర్ ఇచ్చిన రెండు సునాయస క్యాచ్‌లను కరుణ్ నాయర్ నేలపాలు చేశాడు. విప్రజ్ నిగమ్ బౌలింగ్‌లో ఒకటి కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో మరో క్యాచ్‌ను కరుణ్ నాయర్ అందుకోలేకపోయాడు. ఈ అవకాశాలతో చెలరేగిన శ్రేయస్ అయ్యర్.. పంజాబ్ కింగ్స్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఇన్నింగ్స్ ఆరంభంలో ప్రియాన్ష్ ఆర్య ఇచ్చిన క్యాచ్‌ను లుంగి ఎంగిడి నేలపాలు చేశాడు. ఈ క్యాచ్ అందుకునే క్రమంలో అతను తీవ్రంగా గాయపడి మ్యాచ్‌కు దూరమయ్యాడు. క్యాచ్‌తో పాటు అతని గైర్హాజరీ ఢిల్లీ క్యాపిటల్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. అక్షర్ పటేల్ వేసిన 9వ ఓవర్‌లో కూపర్ కానల్లీ ఇచ్చిన క్యాచ్‌ను ముఖేష్ కుమార్ అందుకొని బౌండరీ లైన్ తాకాడు. దాంతో ఈ క్యాచ్ కాస్త సిక్సర్‌గా మారింది. ఓవరాల్‌గా నాలుగు క్యాచ్ డ్రాప్స్ ఢిల్లీ క్యాపిటల్స్ పతనాన్ని శాసించాయి. లుంగి ఎంగిడి గాయపడకపోయినా ఫలితం మరోలా ఉండేది. కట్టడిగా బౌలింగ్ చేయడంలో ఎంగిడి దిట్ట. కానీ తీవ్రమైన గాయంతో అతను మైదానం వీడాల్సి వచ్చింది.

### కేఎల్ షాట్స్ చూశాక కొట్టగలం అనిపించింది: శ్రేయస్

ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ కేఎల్ రాహుల్‌పై పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రశంసల జల్లు కురిపించాడు. రాహుల్ బ్యాటింగ్ చూడ ముచ్చటగా ఉందని కొనియాడాడు. అయితే రాహులే ఈజీగా షాట్స్ ఆడినప్పుడు తాము కూడా ఆడగలమనే నమ్మకం కలిగిందన్నాడు. దాంతోనే ఢిల్లీ క్యాపిటల్స్ ఎంత స్కోర్ చేసినా.. తాము ఒక పరుగు ఎక్కువే చేయాలని మనసులో గట్టిగా అనుకున్నానని అయ్యర్ చెప్పాడు. 'నిజం చెప్పాలంటే.. ఈ మ్యాచ్ గురించి మాట్లాడేందుకు నా దగ్గర మాటలు లేవు. ఇక్కడ ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. దానికి తోడు బౌలర్లు ఫోర్లు, సిక్సర్లు ఇస్తుంటే పిచ్చ కోపం వచ్చింది. ఏం చేయాలో అర్థం కాలేదు. కానీ ఇది బ్యాటింగ్‌కు అనుకూలమైన వికెట్ అని తెలుసు. వాస్తవానికి ఈ పిచ్‌పై టర్న్ లభిస్తుందని అనుకున్నాం. కానీ ఇక్కడ స్పిన్‌కు పెద్దగా అవకాశం లేదు. పవర్‌ప్లే తర్వాత చాహల్ బౌలింగ్ చేసినప్పుడు బంతి కొంచెం ఆగుతూ వచ్చింది. కానీ పెద్దగా ప్రభావం చూపలేదు. ఇక కేఎల్ రాహుల్‌ను అభినందించాలి. అతను ఆడిన తీరు అద్భుతం. అతని బ్యాటింగ్ చూడముచ్చటగా ఉంది. బౌలర్లు వేసే ప్రతి బంతిని రాహుల్ ఎంతో చాకచక్యంగా ఆడుతూ అందమైన షాట్లు కొట్టాడు. అతను చాలా ఈజీగా పరుగులు చేశాడు. అతనే ఈజీగా ఆడినప్పుడు మేం కూడా ఆడగలమని నాకు నేను చెప్పుకున్నా. లక్ష్య ఛేదనకు ముందు మా వాళ్లకు నేను ఒకటే చెప్పా. గత మ్యాచ్‌ల్లో కూడా 220-225 పరుగుల లక్ష్యాలను రెండు ఓవర్లు మిగిలి ఉండగానే ఛేదించాం. కాబట్టి అదే మైండ్‌సెట్‌తో ఆడుదామని చెప్పా. పవర్‌ప్లేలో వీలైనన్ని ఎక్కువ పరుగులు చేయాలనుకున్నాం. మా ఓపెనర్లు తొలి బంతి నుంచే రెచ్చిపోయి ఆడి మాకు మంచి పునాది వేశారు. ఆ జోరును మేం కొనసాగించాలనుకున్నాం' అని శ్రేయస్ పేర్కొన్నాడు.



### మాది చెత్త ఫీల్డింగ్: అక్షర్

చెత్త ఫీల్డింగే తమ ఓటమిని శాసించిందని ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ అన్నాడు. బౌలింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై క్యాచ్‌లు చేజార్చడం ఏ మాత్రం సమంజసం కాదని తెలిపాడు. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన అక్షర్ పటేల్.. క్యాచ్‌లు వదిలేయడంతో పాటు పవర్ ప్లే బౌలింగ్ తమ ఓటమిని శాసించిందని చెప్పాడు. 'బౌలింగ్‌కు ప్రతికూలంగా ఉన్న ఈ వికెట్‌పై వచ్చిన అవకాశాలను వదిలేస్తే ఎలా గెలుస్తాం. సునాయస క్యాచ్‌లను వదిలేయడం మా విజయవకాశాలను దెబ్బతీసింది. ఇది బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్. చిన్న మైదానం కాబట్టి సిక్సర్లు వెళ్లడం సహజం. కానీ వచ్చిన క్యాచ్‌లను వదిలేస్తే గెలవడం కష్టం. ఇలాంటి వికెట్‌పై బౌలర్లకు అండగా ఉండకపోతే పరిస్థితులు కఠినంగా మారుతాయి. మా బౌలింగ్ విభాగాన్ని కూడా మేం సమీక్షించుకోవాలి. పవర్ ప్లేలో మా ఫాస్ట్ బౌలర్లు బౌలింగ్ చేసిన తీరు, ఫీల్డింగ్, చేజార్చిన క్యాచ్‌లు మా ఓటమికి ప్రధాన కారణాలు. ఎందుకంటే ఈ వికెట్‌పై 264 అనేది చాలా మంచి స్కోరు. ఈ మ్యాచ్‌లో ఓడినా 264 పరుగులు చేయడం మాకు కలిసొచ్చే అంశం. ఐపీఎల్‌లోనే ఇది రికార్డ్ స్కోర్. కొంచెం అదృష్టం కలిసొచ్చి క్యాచ్‌లు పట్టి ఉంటే.. వరుసగా మ్యాచ్‌లు గెలవగలం. మేం ఓడిపోయిన మ్యాచ్‌లన్నీ తృటిలో కోల్పోయినవే. కీలక సమయాల్లో పట్టు సాధిస్తే ఫలితాలు మాకు అనుకూలంగా వస్తాయి. కానీ ఆ క్షణాలను మేం అందిపుచ్చుకోవాలి. ప్రతిసారి మైదానంలోకి వచ్చి అవే తప్పులను పునరావృతం చేయకూడదు. అందుకే మేం మా ఆటతీరుపై సమీక్ష చేసుకోవాలనుకుంటున్నాం.'అని అక్షర్ పటేల్ చెప్పుకొచ్చాడు.

### కోహ్లి ఇచ్చిన క్యాచ్ వదిలేస్తే అంతే: గవాస్కర్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ప్రశంసల జల్లు కురిపించాడు. విరాట్ కోహ్లీ ఛేజ్ మాస్టర్ అని, భారీ లక్ష్యాన్ని కూడా ఈజీగా మారుస్తాడని కొనియాడాడు. 'సిరాజ్ బౌలింగ్‌లో విరాట్ కోహ్లీ ఇచ్చిన క్యాచ్‌ను వదిలేయడం గుజరాత్ టైటాన్స్‌కు తీవ్ర నష్టం చేసింది. కోహ్లీ కేవలం కింగ్ మాత్రమే కాదు.. ఛేజ్ మాస్టర్. తొలి బంతికే కోహ్లీ లాంటి ఆటగాడి క్యాచ్‌ను వదిలేస్తే.. భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే. భారీ లక్ష్యాలను సులువుగా ఛేదించడం విరాట్ కోహ్లీ స్టైల్. క్రికెట్ చరిత్రలోని గొప్ప ఆటగాళ్లలో కోహ్లీ ఒకడు. కష్టమైన లక్ష్యాన్ని సైతం సునాయసం చేశాడు.'అని గవాస్కర్ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీతో పాటు రాణించిన దేవదత్ పడిక్కల్(55)ను కూడా గవాస్కర్ ప్రశంసించాడు. 'దేవదత్ పడిక్కల్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. మ్యాచ్ తర్వాత విరాట్ కోహ్లీ చెప్పినట్లుగా.. పడిక్కల్ చాలా చక్కటి క్రికెట్ షాట్స్ ఆడుతున్నాడు. గతంలో అతను ఆఫ్-సైడ్ ఆటగాడిగా కనిపించాడు. అతని ప్రధాన స్కోరింగ్ ప్రాంతాలు కవర్, మిడ్-ఆఫ్. ఆన్-సైడ్‌లో అతను ఇబ్బంది పడేవాడు. కానీ ఇప్పుడు ఆ పరిమితిని అధిగమించాడు. అతను ఇప్పుడు స్క్వేర్ బిహైండ్ సిక్స్‌లు, బౌండరీలను కూడా కొడుతున్నాడు. ఇది ఆర్సీబీ బ్యాటింగ్ బలాన్ని పెంచుతుంది. వారికి మూడో స్థానంలో దేవదత్ ఉండగా.. నాలుగో స్థానంలో కెప్టెన్ రజత్ పాటిదార్ ఉన్నారు. వీరిద్దరూ మొదటి బంతి నుంచే సిక్సర్లు కొట్టగలరు. ఇది ఆర్‌సీబీకి కలిసొచ్చే అంశం.'అని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు.

# అభి-ఇషాన్ కుమ్మేశారు!

### హైదరాబాద్‌కు వరుసగా నాలుగో విజయం

**రాజస్థాన్‌పై సూపర్ విక్టరీ.. వైభవ్ సూర్యవంశీ శతకం వృథా**



ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జైత్రయాత్ర కొనసాగుతోంది. వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది. శనివారం జైపూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ శతకం వృథా అయ్యింది. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఇది ఐదో విజయం కాగా.. రాజస్థాన్ రాయల్స్‌కు మూడో ఓటమి. ఈ సీజన్‌లో రెండు మ్యాచ్‌లకు రెండింటిలోనూ రాజస్థాన్ రాయల్స్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓడించింది. లోయార్డర్ బ్యాటింగ్ వైఫల్యం, చెత్త ఫీల్డింగ్ రాజస్థాన్ రాయల్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ఇచ్చిన సునాయస క్యాచ్‌లను రాజస్థాన్ రాయల్స్ ఫీల్డర్లు వదిలేసారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ఇషాన్ మలింగా(2/38) రెండు వికెట్లు తీయగా.. ప్యాట్ కమిన్స్, సాకిబ్ హుస్సేన్, నితీష్ కుమార్ రెడ్డి, ప్రఫుల్ హింగేలు తలో వికెట్ తీసారు. అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ 18.3 ఓవర్లలో 5 వికెట్లకు 229 పరుగులు చేసి గెలుపొందింది. ఇషాన్ కిషన్(31 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లతో 74), అభిషేక్ శర్మ(29 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 57) విధ్వంసకర అర్ధ శతకాలతో చెలరేగగా.. నితీష్ కుమార్ రెడ్డి(18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 36), హెన్రీచ్ క్లాసెన్(24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 29) దూకుడుగా ఆడారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, బ్రిజేష్ శర్మ రెండేసి వికెట్లు తీయగా.. డొనోవన్ ఫెర్రీరా ఒక వికెట్ తీసాడు. 229 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. తొలి ఓవర్‌లోనే ట్రావిస్ హెడ్ ఔటవ్వగా.. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ జట్టును ఆదుకున్నారు. దూకుడుగా ఆడి పవర్ ప్లేలో భారీ స్కోర్ అందించడంతో పాటు రెండో వికెట్‌కు 132 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఈ భాగస్వామ్యంతో సన్‌రైజర్స్ లక్ష్య ఛేదన ఈజీ అయ్యింది. తర్వాత వచ్చిన నితీష్ కుమార్ రెడ్డి, క్లాసెన్ తమదైన శైలిలో చెలరేగి జట్టును విజయం ముంగిట నిలబెట్టారు. సన్‌రైజర్స్ బ్యాటర్లు ఇచ్చిన క్యాచ్‌లను రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు వదిలేసారు. ఇది సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కలిసొచ్చింది. అంతేకాకుండా రాజస్థాన్ రాయల్స్ లోయరార్డర్ బ్యాటర్లు దూకుడుగా ఆడలేకపోయారు. వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జురెల్ ధాటికి ఓ దశలో రాజస్థాన్ రాయల్స్ 250 ప్లస్ స్కోర్ చేసేలా కనిపించింది. కానీ ఆరెంజ్ ఆర్మీ బౌలర్లు అద్భుతంగా పుంజుకొని రాజస్థాన్‌ను 230లోపు కట్టడి చేశారు. ముఖ్యంగా ప్రఫుల్ హింగే ఆఖరి ఓవర్‌లో ఒక వికెట్ తీసి రాజస్థాన్ పరుగుల వేగాన్ని అడ్డుకున్నాడు.

**వైభవ్ సెంచరీ**

రాజస్థాన్ రాయల్స్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర శతకంతో చెలరేగాడు. 36 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఈ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై కసితీరా పగ తీర్చుకున్నాడు. ఈ సీజన్‌లో ఉప్పల్ వేదికగా జరిగిన గత మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ డకౌట్ అయ్యాడు. సన్‌రైజర్స్ అనామక పేసర్ ప్రఫుల్ హింగే బౌలింగ్‌లో గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగాడు. కానీ ఈ మ్యాచ్‌లో ప్రఫుల్ హింగేతో పాటు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌పై వైభవ్ సూర్యవంశీ విరుచుకుపడ్డాడు. ప్రఫుల్ హింగే వేసిన తొలి ఓవర్‌లో వరుసగా 4 సిక్స్‌లు బాది.. గత మ్యాచ్ డకౌట్‌కు బదులు తీర్చుకున్నాడు. ప్యాట్ కమిన్స్ బౌలింగ్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతినే వైభవ్ సిక్సర్ బాది తన ఫియర్‌లెస్ గేమ్‌ను చాటుకున్నాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో 15 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్న వైభవ్ సూర్యవంశీ.. 36 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ శతకాన్ని వైభవ్ వినూత్నంగా సెలెబ్రేట్ చేసుకున్నాడు. లవ్ యూ రాజస్థాన్ రాయల్స్ అని సైగలు చేశాడు. ఐపీఎల్ మూడో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డ్ అందుకున్నాడు. రెండో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డ్(35 బంతుల్లో) కూడా వైభవ్ పేరిట ఉన్న సంగతి తెలిసిందే. జస్‌ప్రీత్ బుమ్రా, జోష్ హజెల్ వుడ్, భువనేశ్వర్ కుమార్, కగిసో రబడా వంటి వరల్డ్ క్లాస్ బౌలర్లు చితక్కొట్టిన ఈ బుడ్డోడు.. తాజా మ్యాచ్‌లో కమిన్స్‌కు కూడా తన బ్యాటింగ్ రుచి చూపించాడు.



### చెమటోడుస్తున్న రోహిత్

ఏప్రిల్ 12న ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో గాయపడిన ముంబై హీరో రోహిత్ శర్మ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నాడు. ఏప్రిల్ 29న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగనున్న మ్యాచ్‌లో రోహిత్ ఆడతాడని ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి. అందుకోసం రోహిత్ తీవ్రంగా శ్రమిస్తున్నాడు. పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచులకు రోహిత్ బెంచ్ పైనే ఉన్నాడు. సీఎస్‌కేతో ఆడతాడని అంతా భావించినా.. మేనేజ్‌మెంట్ మాత్రం రిస్క్ తీసుకోలేదు. మరో నాలుగు రోజుల సమయం ఉండటంతో అప్పటికి ఫుల్ ఫిట్‌నెస్ సాధిస్తాడని ముంబయి ఇండియన్స్ పేర్కొంది. సీనియర్ క్రికెటర్ రోహిత్ శర్మ ఐపీఎల్ 2026 సీజన్‌ను మెరుగ్గానే ప్రారంభించాడు. నాలుగు మ్యాచుల్లో 165 స్ట్రైక్‌రేట్‌తో 137 పరుగులు చేశాడు. ఇందులో ఒక హాఫ్ సెంచరీ కూడా ఉంది. కానీ, గాయం కారణంగా బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. మరోవైపు ఓపెనింగ్‌కు వచ్చిన డికాక్ దూకుడుగా ఆడుతున్నా.. నాన్‌స్ట్రైకింగ్ నుంచి పెద్దగా సహకారం లభించడం లేదు. రోహిత్ ఉంటే ముంబయి ఇండియన్స్‌కు బెనిఫిట్ అవుతుందనేది అభిమానుల ఆకాంక్ష. ఇప్పటికి ఏడు మ్యాచుల్లో కేవలం రెండే విజయాలు సాధించిన ముంబయి పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉంది. మిగతా ఏడు మ్యాచుల్లో కనీసం ఒక్కటి ఓడినా.. ప్లేఆఫ్స్ అవకాశాలు గల్లంతు అయినట్లే.

### చెంపదెబ్బతో హర్భజన్‌కు రూ.కోటి ఆదాయం: శ్రీశాంత్

తొలి ఐపీఎల్ సీజన్‌లో మాజీ ఆటగాళ్లు హర్భజన్ సింగ్ - శ్రీశాంత్ మధ్య జరిగిన 'చెంపదెబ్బ' ఘటన ఇప్పటికీ చర్చనీయాంశమే. దీనిపై తాజాగా మాజీ పేసర్ శ్రీశాంత్ స్పందిస్తూ సంచలన ఆరోపణలు చేశాడు. ఆ ఘటనను ఉపయోగించుకుని హర్భజన్ రూ.కోటి లాభం పొందాడని ఆరోపించాడు. ఈ మేరకు ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి స్పందించాడు. 'భజ్జీ గురించి నేను ఇప్పటివరకు ఏ ఇంటర్వ్యూల్లో మాట్లాడలేదు. బహుశా ఇదే తొలిసారి. నాటి చెంపదెబ్బ గురించి నేను పట్టించుకోవడం మానేశా. కానీ, ఇటీవల కాలంలో హర్భజన్ దానిపై ఓ యాడ్ చేశాడు. దాన్నుంచి రూ.కోటి వరకు ఆదాయం పొందాడు. అక్కడితో ఆగకుండా ఆ యాడ్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయమని నాకు ఫోన్ చేసి అడిగాడు. అప్పుడు నేను అతడికి ఒకే మాట చెప్పా.. 'నేను నిన్ను క్షమిస్తాను.. కానీ ఆ ఘటనను ఎప్పటికీ మర్చిపోను' అని అన్నా. మనకు ఏదైనా చెడు జరిగితే.. దానికి బాధ్యులైన వారిని క్షమించాలి కానీ, ఆ చెడును మర్చిపోకూడదు. ఒకవేళ మర్చిపోతే.. అవతలి వ్యక్తి మళ్లీ అదే తప్పు చేయాలని చూస్తాడు. అందుకు భజ్జీనే సరైన ఉదాహరణ. ఈ మధ్య చాలా ఇంటర్వ్యూల్లో హర్భజన్ ఈ ఘటన గురించి మాట్లాడాడు. తాను చాలా పెద్ద తప్పు చేశానని సానుభూతి పొందే ప్రయత్నం చేశాడు. నా కుమార్తె గురించి కూడా మాట్లాడాడు. వ్యక్తిగతంగా నాకు అతడిపై ద్వేషం లేదు. కానీ, ఒకట్రెండు నెలల క్రితం ఈ యాడ్ చేయడంతో భజ్జీని ఇన్‌స్టాలో బ్లాక్ చేశా. అతడిదంతా నటనేనని అప్పుడే అర్థమైంది' అని శ్రీశాంత్ విమర్శించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ తొలి సీజన్ 2008లో మొదలైంది. ఆ ఎడిషన్‌లో ముంబయి ఇండియన్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్ మ్యాచ్ అనంతరం ఆటగాళ్లంతా షేక్‌హ్యాండ్ ఇచ్చుకుంటుండగా.. ఉన్నట్టుండి శ్రీశాంత్ చెంపపై హర్భజన్ దెబ్బ కొట్టాడు. దీంతో శ్రీశాంత్ మైదానంలోనే కన్నీళ్లు పెట్టుకున్నాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
ఆదివారం 26-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు

సంపాదకీయం | Editorial

# డిజిటల్ జనగణన.. దేశాభివృద్ధికి దిక్సూచి

భారతదేశం తన 16వ జాతీయ జనగణన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. 2011 తర్వాత అంటే దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం జరుగుతున్న ఈ 2027 జనగణన, దేశ సామాజిక-ఆర్థిక గమనాన్ని మార్చబోతోంది. కోవిడ్ మహమ్మారి కారణంగా 2021లో జరగాల్సిన ఈ ప్రక్రియ ఆలస్యమైనప్పటికీ, ఇప్పుడు సరికొత్త హంగులతో మన ముందుకు వస్తోంది. ఈసారి జనగణనలో అతిపెద్ద మార్పు డిజిటల్ విధానం. కాగితాల అవసరం లేకుండా మొబైల్ యాప్‌ల ద్వారా డేటా సేకరించడం వల్ల ఫలితాల విశ్లేషణ వేగవంతం అవుతుంది. ప్రజలే స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' (స్వీయ గణన) సౌకర్యం కల్పించడం పౌర భాగస్వామ్యాన్ని పెంచుతుంది. ఈ జనగణనలో మరో కీలక అంశం కుల గణన. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా సమగ్రమైన కుల వివరాలను సేకరించడం ద్వారా సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరువయ్యేలా చేసే అవకాశం ఉంటుంది. సామాజిక న్యాయం దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగుగా భావించవచ్చు. ఈ జనాభా లెక్కల డేటా కేవలం అభివృద్ధి పథకాలకే పరిమితం కాదు. 2026 తర్వాత జరిగే నియోజకవర్గాల విభజనకు ఈ గణాంకాలే ఆధారం కానున్నాయి. లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు కావాలంటే ఈ కొత్త జనాభా లెక్కలు అత్యంత అవసరం. మారిన ప్రజల జీవనశైలి, వలసలు, విద్య, ఆర్థిక స్థితిగతులను అర్థం చేసుకోవడానికి 2011 నాటి పాత లెక్కలు ఏమాత్రం సరిపోవు. సుమారు 30 లక్షల మంది సిబ్బంది, ₹11,718 కోట్ల బడ్జెట్‌తో చేపడుతున్న ఈ బృహత్తర కార్యం విజయవంతం కావాలంటే పౌరుల సహకారం అనివార్యం. సరైన సమాచారం ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత, ఎందుకంటే ఆ సమాచారమే రేపటి నవ భారతానికి బలమైన పునాది.



# తెలంగాణలో నూతన సమరం

తెలంగాణ గడ్డపై మరో రాజకీయ యుద్ధానికి రంగం సిద్ధమైంది. దశాబ్ద కాలంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య సాగుతున్న త్రిముఖ పోరాటం, ఇప్పుడు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ 'టీఆర్ఎస్' (తెలంగాణ రాష్ట్ర సేన) ఆవిర్భావంతో చతుర్ముఖ పోటీగా రూపుదాల్చింది. ఏప్రిల్ 25, 2026న మేడ్చల్ వేదికగా జరిగిన పార్టీ ఆవిర్భావం, రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనాన్ని సృష్టించింది. బీఆర్ఎస్ తన పేరును మార్చుకుని జాతీయ రాజకీయాల్లోకి వెళ్లిన తర్వాత ఏర్పడిన 'ప్రాంతీయ శూన్యత'ను భర్తీ చేయడమే లక్ష్యంగా కవిత ఈ అడుగు వేశారు.

పాత 'టీఆర్ఎస్' పేరులోని భావోద్వేగాలను, తెలంగాణ సెంటిమెంట్‌ను తిరిగి ప్రజల్లోకి తీసుకెళ్లాలనేది ఆమె ప్రధాన వ్యూహంలా కనిపిస్తోంది. "సామాజిక తెలంగాణ" సాధనే ధ్యేయమని ప్రకటించడం ద్వారా, ఆమె అసంతృప్తిగా ఉన్న ఉద్యమకారులను, యువతను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ఈ కొత్త పార్టీ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చే అవకాశం ఉంది. ఇది వారికి ఒక రకంగా సవాలే. తెలంగాణలో బలమైన ప్రత్యామ్నాయంగా ఎదగాలనుకుంటున్న బీజేపీకి, మరో ప్రాంతీయ పార్టీ రాక వారి ఓటు బ్యాంకుపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఆసక్తికరం. సొంత కుటుంబం నుంచే చీలిక రావడం, అది కూడా తండ్రి పెట్టిన పాత పేరుతోనే పార్టీ రావడం బీఆర్ఎస్ నాయకత్వానికి మింగుడుపడని అంశం. ఇది బీఆర్ఎస్ ఓటు బ్యాంకును భారీగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఈ చతుర్ముఖ పోటీ వల్ల రాష్ట్రంలో ఓట్లు భారీగా చీలిపోయే అవకాశం ఉంది. ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని పక్షంలో, రాబోయే 2028-2029 ఎన్నికల తర్వాత కింగ్ మేకర్ పాత్రను పోషించే దిశగా కవిత తన పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా మహిళా సాధికారత, నిరుద్యోగ సమస్యలను ఎజెండాగా మార్చుకోవడం ద్వారా ఆమె ఒక కొత్త ఓటు వర్గాన్ని సృష్టించుకునే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు విశ్లేషణలకు అందనంత క్లిష్టంగా మారాయి. 'తెలంగాణ గడ్డపై పుట్టిన పార్టీనే మేలు' అనే సెంటిమెంట్ పనిచేస్తుందా లేక జాతీయ పార్టీల హవా కొనసాగుతుందా అన్నది కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా, 2026 నుంచి మొదలైన ఈ రాజకీయ చదరంగం, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించడంలో కీలకం కానుంది.

**- రాజశేఖర్ సుందరంపూడి, హైదరాబాద్**



# కులగణన పాలకుల చిత్తశుద్ధికి పరీక్ష

భారతదేశ సామాజిక ముఖచిత్రంలో 'కులం' ఒక విడదీయలేని వాస్తవం. సంక్షేమ ఫలాలు అట్టడుగు వర్గాలకు సమంగా అందాలన్నా, రిజర్వేషన్ల ఫలాలు అర్హులకు చేరాలన్నా శాస్త్రీయమైన సమాచారం అవసరం. అయితే, దేశవ్యాప్త కులగణన విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు 'ఆపేక్షనీయం' (కావలసినంత స్పష్టత లేనిది) గా కనిపిస్తోంది. ఓట్ల వేటలో కులాన్ని వాడుకునే రాజకీయ పార్టీలు, గణాంకాల సేకరణ దగ్గరకు వచ్చేసరికి వెనకడుగు వేయడం గమనార్హం.

కులగణన అనేది కేవలం అంకెల సేకరణ కాదు, అది సామాజిక న్యాయానికి పునాది. అయితే, ఈ గణాంకాలు బయటకు వస్తే తమ రాజకీయ పునాదులు కదులుతాయేమోనన్న భయం ప్రధాన పార్టీలను వెన్నాడుతోంది. బీహార్, తెలంగాణ వంటి రాష్ట్రాలు సొంతంగా సర్వేలు చేపట్టినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో దీనిపై స్పష్టమైన నిర్ణయం తీసుకోలేకపోతోంది. జనాభా గణనలో కులాల వివరాలు చేర్చడానికి సాంకేతిక కారణాలు చూపుతున్నప్పటికీ, అసలు కారణం సామాజిక వర్గాల మధ్య తలెత్తే డిమాండ్లను తట్టుకోలేకపోవడమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణలో ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేను ప్రభుత్వం "మెగా హెల్త్ చెకప్" గా అభివర్ణించింది. అయితే, గతంలో జరిగిన సర్వేల గణాంకాలకు, ప్రస్తుత గణాంకాలకు మధ్య తేడాలు ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు, బీసీల జనాభా తగ్గడం లేదా పెరగడం వంటి విషయాల్లో రాజకీయ రంగు పులుముకోవడం వల్ల అసలు లక్ష్యం పక్కదారి పడుతోంది. "ఎవరి వాటా వారికి" అనే నినాదం వినిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అది అమలు కావాలంటే కచ్చితమైన డేటా ఉండాలి. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబడిన వర్గాలకు దక్కాల్సిన అవకాశాలు కేవలం అంచనాల మీద ఆధారపడి ఉండటం వల్ల అనేక వర్గాలు అన్యాయానికి గురవుతున్నాయి. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించకుండా, కేవలం ఎన్నికల తాయిలంగా కులగణనను వాడుకోవడం వల్ల సామాజిక అసమానతలు తొలగకపోగా, కొత్త వివాదాలకు దారితీసే ప్రమాదం ఉంది. కులగణన అనేది పాలకుల రాజకీయ లబ్ధి కోసం కాకుండా, పౌరుల సామాజికాభివృద్ధి కోసం జరగాలి. పారదర్శకమైన విధానం, శాస్త్రీయమైన విశ్లేషణ, రాజకీయాలకు అతీతమైన దృక్పథం ఉన్నప్పుడే కులగణన నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది. అస్పష్టతను వీడి, స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగడమే నేటి అవసరం.

**- సతీశ్ సత్యరూప్, వరంగల్**

# భక్తి ముసుగులో వ్యాపారం

పుణ్యక్షేత్రాలు భక్తికి నిలయాలుగా, మానసిక ప్రశాంతతను ఇచ్చే కేంద్రాలుగా ఉండాలి. కానీ, నేడు అనేక హిందూ పుణ్యక్షేత్రాలు క్రమంగా 'వ్యాపార కేంద్రాలు'గా మారుతుండటం భక్తులలో తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని కలిగిస్తోంది. పవిత్రమైన దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే సామాన్యుడికి లభించే గౌరవం కంటే, డబ్బులు చెల్లించే వారికి ఇచ్చే ప్రాధాన్యం పెరిగిపోవడం ఆలయ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. నేడు చాలా ప్రముఖ దేవాలయాల్లో దర్శనం కోసం 'వీఐపీ' సంస్కృతి రాజ్యమేలుతోంది. సామాన్య భక్తుడు గంటల తరబడి ఎండనక, వాననక లైన్లలో నిలబడితే, ప్రత్యేక రుసుము చెల్లించే వారికి నిమిషాల్లో దర్శనం లభించడం సామాజిక అసమానతలకు దారితీస్తోంది. ఈ భేదభావం దైవసన్నిధిలో ఉండకూడదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల నిర్వహణలో ప్రభుత్వ పెత్తనం, రాజకీయ జోక్యం పెరగడం వల్ల నిధుల దుర్వినియోగం జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భక్తులు భక్తితో సమర్పించే కానుకలు, హుండీ ఆదాయం అన్యాక్రాంతం అవుతున్నాయని, ఆలయ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని గణంకాలు చెబుతున్నాయి. ప్రసాదాల తయారీలో నాణ్యత లోపించడం, కలుషితమైన పాలు వాడటం వంటి సంఘటనలు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయి. ఆలయ ప్రాంగణాల్లో భద్రతా సిబ్బంది లేదా బోర్డు సభ్యులు భక్తులపై దురుసుగా ప్రవర్తించిన సంఘటనలు భక్తుల ఆగ్రహానికి కారణమవుతున్నాయి. హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తి చేయాలనే డిమాండ్ ఇటీవల బలపడుతోంది. ఇతర మతాల ప్రార్థనా మందిరాల వలె హిందూ ఆలయాలను కూడా భక్తుల కమిటీలే నిర్వహించుకునే హక్కు ఉండాలని ధార్మిక సంస్థలు వాదిస్తున్నాయి. ప్రభుత్వాలు ఆలయ ఆదాయాన్ని ఇతర అవసరాలకు మళ్లించడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. పుణ్యక్షేత్రాల్లో పవిత్రతను కాపాడటం, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం అధికారుల బాధ్యత. భక్తి అనేది వ్యాపారంగా మారినప్పుడు విశ్వాసం సన్నగిల్లుతుంది. తక్షణమే దర్శన విధానాల్లో పారదర్శకత తీసుకురావాలి, వీఐపీ సంస్కృతిని తగ్గించాలి, మరియు ఆలయ నిధులను కేవలం ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకే వినియోగించాలి. అప్పుడే భక్తుల ఆవేదన చల్లారుతుంది, పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం భద్రంగా ఉంటుంది.

**- అభిషేక్ కురుమ, భజరంగ్ దళ్**



## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.